www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 234 మంగళవారం, మే 19, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# ఈ-గవర్నేన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

- తమిళనాడు అనుసరిస్తున్న విధానం అనుసరణీయం
- రాష్ట్రాలకు కేంద్ర కేబినేట్ కార్యదర్శి సోమనాథన్ సూచన



**హైదరాబాద్,మే 18 :** కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు సింపుల్ ఈ-గవర్నేన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరు గైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ మిగతా2లో...

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

- ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్ ఏర్పాటు
- నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన




**న్యూఢిల్లీ,మే 18 :** భారత్- నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, మిగతా2లో...

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- ట్రక్కును ఢీకొన్న కంటెయినర్.. పదిమంది మృతి



**ముంబై,మే 18 :** మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై - అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమా చారం అందగానే పోలీసులు సంఘటనా మిగతా2లో...



# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

**తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం**

**మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,మే 18 :** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెలకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ మిగతా2లో...

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

**● కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం ● వారి కృషి అసామాన్యమని మంత్రి అమిత్ షా కితాబు**



**రాయ్‌పూర్,మే 18 :** దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం మిగతా2లో...

# క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం




# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

**● ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్**

**● హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి**



**తిరువనంతపురం,మే 18 :** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరు వనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్ర మాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రు లుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు మిగతా2లో...




# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

- భావితరాలకు భద్రపరచిన అమూల్య వారసత్వ సంపద
- అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి

# ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

**● 516 ర్యాంక్ సాధించిన హర్షిణి ● అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు ● ఇంజనీరింగ్ లో 10వేల లోపు ర్యాంకులు ● విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అభినందన**



**హైదరాబాద్,మే 18 :** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాలి అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ మిగతా2లో...

# నిజామాబాద్‌కు పంగానామాలు

**ఇచ్చిన హామీలను పట్టించుకోని రేవంత్**

**తలెత్తుకోలేక పోతున్న పిసిసి చీఫ్**

**మీడియా సమావేశంలో ఎంపి అర్వింద్ విమర్శలు**



**నిజామాబాద్,మే 18 :** నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయని అన్నారు. ఈ హామీలు నెరవేర్చకపోవడంతో పిసిసి చీఫ్ తతెత్తుకోలేక పోతున్నారని అన్నారు. సోమవారం మిగతా2లో...

# బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు

- మరింత పకడ్బందీగా కేసు విచారణ



# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియో లను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ



బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూ శాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయ వాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో



చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకె ళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనా పరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో,

సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగ పడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు.

# మ్యూజియాలు జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలు

**హైదరాబాద్,మే 18 :** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్‌లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రో షర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. మంత్రి జూపల్లి మాట్లా డుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదా యాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరా లకు చేరుతాయని అన్నారు.దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టా త్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్ లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు.

# బండి భగీరథపై అదనపు సెక్షన్లు

**హైదరాబాద్,మే 18 :** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్‌ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమా ర్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్‌ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు.

# క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం

**హైదరాబాద్,మే 18 :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఇందులో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నరు. ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో జరిగిన జుంబా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన మరియు క్రీడా వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. 5 కిలోమీటర్ల వాకథాన్ ను జెండా ఊపి మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, శివసేన రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, సోనీ బాలాదేవి ప్రారంభించారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

# ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, శీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

(మొదటి పేజీ తరువాయి)

సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు,డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

# ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

(మొదటి పేజీ తరువాయి)

46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాలి÷ కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలి÷ కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

# నిజామాబాద్‌కు పంగానామాలు

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసిఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ చురకలు అంటించారు.

# సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకున్న

**జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు.**




**ములుగు జిల్లా ప్రతినిధి మే 18( పీపుల్స్ న్యూస్):**సోమవారం తాడ్వాయి మండలం మేడారం లోని శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను ములుగు జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కు గిరిజన సంస్కృతి సంప్రదాయాల డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో పూజారులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

# ములుగు జిల్లా లో రెడ్‌క్రాస్ ప్రత్యేక మెంబర్‌షిప్ డ్రైవ్ ప్రారంభం.

**జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ప్రతినిధి మే 18 (పీపుల్స్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ చైర్మన్ శివ్ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో ప్రత్యేక మెంబర్‌షిప్ డ్రైవ్‌ను శనివారం జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 1 వ తేదీ నుండి మే , 31 వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, సేవా గుణం కలిగిన ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెడ్‌క్రాస్ సంస్థ ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.ఇండియన్ రెడ్ క్రాస్ స్పెషల్ మెంబర్షిప్ డ్రైవ్ కొరకు డేటా కేంద్రాన్ని జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనము లో ఏర్పాటు చేయడం జరిగిందని, సభ్యత్వ వివరాల కొరకు కోశాధికారి, స్పెషల్ డ్రైవ్ ఇన్చార్జి శిరుప సతీష్ కుమార్ ను 9948427050 నెంబర్ లో లేదా ప్రధాన కార్యదర్శి చుంచు రమేష్ ను 9394774644 లో సంప్రదించగలరు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి అల్లం రాజ్ కుమార్, బాసాని రామమూర్తి, మాడిశెట్టి దేవేందర్, ఎనగందుల శంకర్, గైని సతీష్ తదితరులు సభ్యత్వం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ప్రెసిడెంట్ అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచు రమేష్, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, పాలక మండలి సభ్యులు కొట్టె రాజి రెడ్డి,సభ్యులు ఏళ్ల మధుసూదన్,పిట్టల మధు,రెడ్ క్రాస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక తో పర్యాటక రంగానికి సరికొత్త కళ.

**జిల్లాలో పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా విభిన్న కార్యక్రమాలు.**
**హెరిటేజ్ వాక్, పర్యాటక క్లబ్ పోస్టర్స్ ను ఆవిష్కరణ.**
**జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు.**







**ములుగు జిల్లా ప్రతినిధి మే 18 (పీపుల్స్ న్యూస్)**99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో పర్యాటక శాఖకు సంబంధించిన బ్రోచర్, పోస్టర్ల ను ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తేదీ.20-05-2026 బుధవారం ములుగు మండలంలోని జాకారం శివాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీకి ఆదేశిస్తూ పలు సూచలనలు చేశారు. తేది.21-05-2026 గురువారం యూట్యూబర్స్ సోషల్ మీడియా, ఇన్ఫ్లుయెన్సర్స్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారినీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఏవో రాజ్ కుమార్, డిపిఆర్ఓ, జిల్లా స్పోర్ట్స్ అధికారి, టూరిజం శాఖ సిబ్బంది, గైడ్స్, టూరిస్ట్ పోలీస్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ కీలకమైనది ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి:-

**ఎంపీడీవో సందీప్**




**ములుగు జిల్లా ప్రతినిధి మే 18 (పీపుల్స్ న్యూస్):** విద్యార్థి దశ చాలా కీలకమైనది ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరానికి ఎదగాలని ములుగు ఎంపీడీవో సందీప్ అన్నారు,. సోమవారం రోజున మండల విద్యా అధికారి తిరుపతి సమక్షంలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్వాహణలో ఏర్పాటు చేసినటువంటి సమావేశానికి ముఖ్యఅతిథిగా సందీప్ పాల్గొని మాట్లాడుతూ... మండలంలో టాప్ టెన్ ఎస్ఎస్సి లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇలాంటి ట్రస్టు వారు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి కార్యక్రమంలో ఎంతో అభినందనీయమని కొనియాడారు విద్యార్థి దశ చాలా కీలకమైనది విద్యార్థులు చదువు అనేది చాలా పవిత్రమైనది చదువును విజ్ఞానానికి దిశగా ప్రయాణానికి విద్య ఎంతో ఉపయోగపడుతుందని కాబట్టి ఈ పదవ తరగతి వరకే కాకుండా ఉన్నత చదువులు చదివి మీలో ప్రతిభను కనుపరిచే విధంగా ప్రతి ఒక్కరు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు, . తల్లిదండ్రులు . పిల్లల భవిష్యత్తు కొరకై ఎంతో శ్రమిస్తూ తమ పిల్లలు ఒక ప్రయోజకుడుగా చూడాలని సంకల్పంతో . అహర్నిశలు ఎంతో కష్టపడుతూ వారి కష్ట ప్రతిఫలంగా . విద్యార్థులను ప్రయోజకుడి గా నిలవాలని అన్నారు, అనంతరం ములుగు మండలంలోని వివిధ పాఠశాలలో చదివినటువంటి టాప్ టెన్ విద్యార్థిని విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ సహకారంతో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్వాహనలో . విద్యార్థి విద్యార్థులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎం.ఐ.ఎస్ ఆఫీసర్ అక్కల రమేష్ టెక్నికల్ కోఆర్డినేటర్ సుదీర్ క్షేత్ర సిబ్బంది రమేష్ కార్తీక్ పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఎస్‌పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ పర్యటన

**వడ్ల కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి.. రైతులకు అండగా ములుగు జిల్లా పోలీసులు**
**వడ్ల రవాణా, తూకం అక్రమాలపై చర్యలు తీసుకుంటాం**
**రైతులకు న్యాయం జరిగేలా చర్యలు**
**జిల్లా ఎస్‌పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్**



**ములుగు జిల్లా ప్రతినిధి మే 18 (పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా జంగాలపల్లి వడ్ల కల్లాన్ని జిల్లా ఎస్‌పి శ్రీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ స్థానిక అధికారులైన ములుగు డిఎస్పి రవీందర్, స్థానిక సీఐ ఎస్ఐ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రైతులు మాట్లాడుతూ, వడ్లను రైస్ మిల్లులకు తరలించేందుకు సరిపడా రవాణా సదుపాయాలు లేక ఆలస్యం జరుగుతోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎస్‌పికి వివరించారు. అదేవిధంగా రైస్ మిల్లుల వద్ద కాంటా తూకంలో అధికంగా వడ్లు కట్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. రైతుల సమస్యలను విన్న ఎస్‌పి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రైతులకు తెలిపారు, రైతుల సమస్యల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ రైతులకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం అబ్బాపూర్‌లోని శ్రీ మాతా ఆగ్రో టెక్ పారా బాయిల్డ్ రైస్ మిల్లును ఎస్‌పి పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాంటా తూకం యంత్రాన్ని, వడ్ల నాణ్యత తనిఖీ ప్రక్రియను పరిశీలించారు.రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లు పారదర్శకంగా కొనుగోలు చేయాలని, తూకం విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి ఎస్‌పి ఆదేశించారు తూకంలో తేడాలు గమనిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోగల వడ్ల కళాలను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రోజువారి ఎగుమతి పై నివేదిక ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు.

# గాంధీనగర్ గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణ పై గ్రామ సభ




**ములుగు జిల్లా ప్రతినిధి మే 18 (పీపుల్స్ న్యూస్):** గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో 350 మంది గ్రామ ప్రజలతో ఆదర్శ గ్రామ నిర్మాణం పై అవగాహన కల్పిస్తూ గ్రామ సభను నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలవికాస ఆదర్శ గ్రామం పథకం సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్డు భవనాలు నిర్మించుకోవడం కాదు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టు బాట్లు నియమాలు పద్ధతులు పెట్టుకుని వాటిని పాటిస్తూ ఊరంతా కలిసి ఒకే మాట ఒకే బాటలో ఐక్యముతో ఉంటే ఆదర్శ ఆదర్శ గ్రామం సాధించుకోవచ్చని అభివృద్ధి గ్రామానికి ఆదర్శ గ్రామానికి తేడా మనకు అర్థం కావాలని డబ్బులుంటే అభివృద్ధి చేసుకోవచ్చు కానీ ఆదర్శ గ్రామమంటే ప్రజలందరూ కలిసి ఒకరికొకరు ఆలోచనలు అభిప్రాయాలు పంచుకుంటూ ఐక్యమత్యంతో గ్రామంలో ఉన్న వనరులను గుర్తించి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవచ్చు ఈ సందర్భంగా ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం గ్రామ సర్పంచ్ బానోత్ ,నిర్మల వెంకన్న మాట్లాడుతూ మా గ్రామంలో పాల వికాసం సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామపంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాము బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో మా గ్రామం ఎన్నుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు ఈరోజు మా గ్రామంలో ఒక పండగ వాతావరణం ఉందన్నారు గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవడానికి ముందుకొచ్చిన కమిటీ వాళ్లకు అభినందనలు తెలుపుతున్నాము అందరం కలిసి మన గ్రామాన్ని మార్చుకున్నామని గ్రామస్తులకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో, గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్, పంచాయతీ కార్యదర్శి రఘు, వార్డు సభ్యులు, మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, రామావత్ సంధ్య, తేజావత్ హుని, లిక్కి కుమారస్వామి, లాకావత్ ఈరయ, బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజ్ కుమార్ , డెవలప్మెంట్ ఏజెంట్లు , కే వినయ్ కుమార్, శంకర్ గ్రామం పెద్దలు గ్రామ ప్రజలు యువకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సి.హెచ్. తిరుపతిని మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ పట్లోళ్ల నాగిరెడ్డి




**బాలానగర్ మే19 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.హెచ్. తిరుపతిని భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి. నాగిరెడ్డి, కాలనీ జనరల్ సెక్రటరీ బాబు మర్యాద పూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పూల బొకేతో అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన శానిటేషన్, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భరత్ నగర్ కాలనీతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు మరింత మేలు జరిగేలా పరిపాలన అందించాలని కోరుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని కొనియాడారు. ఇది నిజమైన ప్రజా పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యంగా భరత్ నగర్ కాలనీలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీమతి సృజన, జోనల్ కమిషనర్ మహాన్ సింగ్, అప్పటి డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మరియు కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించిన సమావేశాన్ని ఈ సందర్భంగా తిరుపతికి గుర్తు చేశారు. ఆ సమావేశంలో కాలనీ అభివృద్ధికి సంబంధించి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ప్రత్యేకంగా భరత్ నగర్ కాలనీ ప్రధాన ముఖ ద్వారం గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురవుతోందని, దీనిపై వెంటనే చర్యలు తీసుకుని కాలనీకి శాశ్వత పరిష్కారం కల్పించాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందు బాటులోకి తీసుకువచ్చి భరత్ నగర్ కాలనీని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# తప్పించుకు తిరుగుతున్న 'ఫేక్ నంబర్ ప్లేట్' కేటుగాడు అరెస్ట్

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 19 (పీపుల్స్ న్యూస్) :** ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవడానికి , ఫైనాన్స్ ఏజెన్సీలను తప్పుదోవ పట్టించడానికి చట్టవిరుద్ధంగా నకిలీ (ఫేక్) నంబర్ ప్లేట్ వాడుతున్న ఒక నిందితుడిని మెహదీపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సిటీ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) డి. జోయల్ డేవిస్ సోమవారం వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ , మెహదీపట్నం లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా సమన్వయంతో పనిచేసి ఈ ఘరానా మోసాన్ని చేధించినట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ మెహదీపట్నం సాయి నగర్‌కు చెందిన సుసేందర్ చిదంబరం (30) అనే వ్యక్తి 2017లో ఒక హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. అయితే ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు కట్టకుండా, ఆర్టీఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించకుండా కాలం వెళ్లదీస్తున్నాడు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినప్పుడు వచ్చే చలానాల నుండి తప్పించుకోవడానికి, ఫైనాన్స్ కంపెనీల కళ్లు కప్పడానికి అతను ఒక పక్కా ప్లాన్ వేశాడు. నిజామాబాద్ టౌన్ కసాబ్ గల్లీకి చెందిన ఎ. అర్జున్ అనే వ్యక్తికి చెందిన పియాజియో అప్రిలియా ద్విచక్ర వాహనం నంబర్ (టీఎస్ 09ఎఫ్ఎఫ్ 7061) ను దొంగతనంగా సేకరించి, ఆ నంబర్ ప్లేటును తన యాక్టివా వాహనానికి తగిలించాడు. నిందితుడు



ORIGINAL VEHICLE No. TS09FF7061 FAKE VEHCILE No. TS09FF7061 (ACTUAL VEHICLE No. TS10YTR5376)

నగరంలో ఇష్టారాజ్యంగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతుండటంతో, ఆ చలానాలన్నీ అసలైన యజమాని అర్జున్‌కు వెళ్లడం ప్రారంభించాయి. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు , నిఘా నిర్వహించే సమయంలో ఈ నకిలీ నంబర్ ప్లేట్ వ్యవహారం వెలుగుచూసింది. దీనిపై తక్షణమే స్పందించిన మెహదీపట్నం పోలీసులు నిందితుడు సుసేందర్ చిదంబరంను అదుపులోకి తీసుకున్నారు. సదరు వాహనం యొక్క అసలైన నంబర్ టీఎస్ 10వైటీఆర్ 5376 గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. నిందితుడికి నోటీసులు జారీ చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు జాయింట్ కమిషనర్ తెలిపారు. ఫేక్ నంబర్ ప్లేట్లు వాడితే కఠిన చర్యలు: ట్రాఫిక్ జాయింట్ సిపి హెచ్చరిక ఈ సందర్భంగా జాయింట్ సీపీ డి. జోయల్ డేవిస్ ఐపీఎస్ గారు వాహనదారులను తీవ్రంగా హెచ్చరించారు. నగరంలో నకిలీ, ట్యాంపరింగ్ చేసిన లేదా ఇతరుల నంబర్ ప్లేట్లను వాడటం మోటారు వాహనాల చట్టం , భారతీయ న్యాయ సంహిత ప్రకారం అత్యంత తీవ్రమైన శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం అత్యాధునిక సీసీటీవీ కెమెరాలు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచుతోందని, ఇలాంటి మోసాలకు పాల్పడే వారిని సులభంగా గుర్తిస్తామని చెప్పారు. మీ వాహన నంబర్ ప్లేట్‌ను ఎవరైనా దుర్వినియోగం చేస్తున్నట్లు అనుమానం వస్తే.. వెంటనే https://echallan.tspolice.gov.in , echallanhelpdesk.hyd@gmail.com , ట్రాఫిక్ ఈ-చలాన్ వాట్సాప్ నంబర్: 8712661690 మార్గాల ద్వారా ఫిర్యాదు చేయాలని జాయింట్ సిపి కోరారు.

# రాష్ట్ర పోలీసు విభాగానికి ఎస్ఐబీ వెన్నుదన్నుగా నిలవాలి



**రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్**
**ఎస్ఐబి విభాగాన్ని సమీక్షించిన డిజిపి సివి ఆనంద్**



**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, మే 19 (పీపుల్స్ న్యూస్) :** భవిష్యత్తులో తెలంగాణ భద్రతకు ఎదురయ్యే సవాళ్లను తిప్పికొట్టేలా రాష్ట్ర పోలీసు విభాగానికి ఎస్ఐబీ వెన్నుదన్నుగా నిలవాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్ దిశా నిర్దేశం చేశారు. హైదరాబాదులోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కార్యాలయాన్ని సందర్శించి, ఉన్నతాధికారులు, సిబ్బందితో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఇంటెలిజెన్స్ అదనపు డిజిపి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజిపి కార్తికేయ తదితరులు పాల్గొన్నారు. . రాష్ట్రంలో మావోయిస్టుల ప్రస్తుత పరిస్థితి, శాంతిభద్రతలకు ఎదురవుతున్న సవాళ్లు, తీవ్రవాద నిరోధక చర్యలపై ఈ సందర్భంగా డిజిపి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సివి ఆనంద్ మాట్లాడుతూ గడిచిన నాలుగు దశాబ్దాలుగా తీవ్ర ప్రభావం చూపిన మావోయిజం ప్రస్తుతం ముగింపు దశలో ఉందని, మారిన పరిస్థితులకు అనుగుణంగా నిఘా విభాగాలు కొత్త సవాళ్లపై దృష్టి సారించాలని అన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని సమర్థ వంతంగా అణచివేయడంలో, క్షేత్రస్థాయి వ్యూహాలను అమలు చేయడంలో ఎస్ఐబీ అద్భుతమైన పాత్ర పోషించిందని ఆయన కొనియాడారు. గడిచిన రెండేళ్లలో (2024 నుంచి 2026 మధ్య) తెలంగాణ పోలీసుల ఎదుట రికార్డు స్థాయిలో 820 మంది మావోయిస్టులు లొంగిపోవడం ఎస్ఐబీ సాధించిన విజయమని డిజిపి అభినందించారు. లొంగిపోయిన వారిలో నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు, 22 మంది స్టేట్ కమిటీ సభ్యులు, ఒక



రీజినల్ కమిటీ సభ్యుడు, 45 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 173 మంది ఏరియా కమిటీ సభ్యుల వంటి అగ్రనేతలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. హింసామార్గాన్ని వీడి ప్రధాన స్రవంతిలో కలిసిన ఈ క్యాడర్ నుంచి పెద్ద ఎత్తున అత్యాధునిక ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, ఇందులో 58 ఏకే-47 రైఫిళ్లు, 48 ఇన్సాస్ రైఫిళ్లు, 50 ఎస్ఎల్ఆర్‌లు, 6 ఎల్ఎమ్‌జీలతో పాటు మొత్తం 334 అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయని వివరించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం అందిస్తున్న పునరావాస కార్యక్రమాలను డిజిపి సమీక్షించారు. వారికి తెలంగాణ పోలీస్ శాఖ నుంచి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. లొంగిపోయిన క్యాడర్ కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు వీలుగా ఉపాధి శిక్షణ కార్యక్రమాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించి సమాజంలో భాగస్వాములను చేసే బాధ్యత ఎస్ఐబి తీసుకోవాలన్నారు. మారుతున్న సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. నాలుగు దశాబ్దాల మావోయిస్టు ఉద్యమం ముగింపు దశకు వచ్చిన తరుణంలో ఇప్పుడు ఎస్ఐబీ తన పరిధిని మరింత విస్తృతం చేసుకోవాలని సూచించారు. సమాజంలో వస్తున్న కొత్త పోకడలు, ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావం వల్ల యువతలో వస్తున్న మార్పులు, దానివల్ల తలెత్తే శాంతిభద్రతల సమస్యలపై నిశిత నిఘా పెట్టాలని ఆదేశించారు.

# గోపాల్ పేట కేంద్రాల్లో లారీలు రాక రైతుల పడిగాపులు: సిపిఐ

**వనపర్తి, మే 19 (పీపుల్స్ న్యూస్) :** గోపాల్ పేట పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు, వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. సోమవారం సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జె చంద్రయ్య మండల కార్యదర్శి మంకలి శాంతన్నతో కలిసి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. గోపాల్ పేట పెట్రోల్ బంక్ ఎదురుగా నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు పేరుకుపోయాయని లారీలు లేక రైతులు పడిగాపులు పడుతున్నారన్నారు. ఇప్పటివరకు కేవలం రెండు లారీలు మూడు డీసీఎంల ధాన్యం మాత్రమే తరలించారని సుమారు 10 లారీల ధాన్యం నెట్లు వేసి పెట్టారన్నారు. భారీ మొత్తంలో ఇంకా ధాన్యం ఆరబోసి ఉందని ఎండిన కొనలేదని వర్షం వస్తే నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ రైతులకు టార్పలింగ్లు ఇవ్వాలని ఆదేశించిన ఇంతవరకు ఇవ్వకపోవడంతో ఒక్కో తార్పలిన్ పీసు రూ. 25 లఅద్దెకు తెచ్చి కప్పారన్నారు. ఆలస్యం అయ్యే కొద్ది అద్దె పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. లారీలను పంపి నెట్లు వేసిన ధాన్యం వెంటనే తరలించాలని, ఆరబోసిన ధాన్యం తడవకముందే కొనాలని డిమాండ్ చేశారు. టార్పలిండ్ల అద్దె డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్



చేశారు. కేంద్రాల్లో నీరు నీడ ఓఆర్ఎస్ పాకెట్లు మెడికల్ కిట్లు వంటి వసతులు లేవని కేంద్రంలో ధాన్యం ఆరబోసిన రైతులు చెట్ల నీడన ఉండాల్సి వస్తుందంటున్నారు. అరకురగా తాగునీరు సప్లై చేస్తున్నారని చాలక ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నారన్నారు. లారీల కొరత తీర్చాలని, కనీస వసతులు కల్పించాలని లేదంటే రైతులతో కలిసి కేంద్రాల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ జె. చంద్రయ్య, మండల కార్యదర్శి శాంతయ్య, పోలికపాడు గ్రామ శాఖ కార్యదర్శి బిచ్చన్న, ఏదుట్ల గ్రామ కార్యదర్శి కోటయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధులు ఉన్న వారు ఏ పండ్లను తినాలి.. వేటిని తినకూడదు..?



కిడ్నీ సమస్యలతో బాధపడే వారు ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్త వహించడం చాలా అవసరం. అయితే ఆహారంపై అవగాహన లేకపోవడంతో చాలా మంది అనేక పదార్థాలకు దూరంగా ఉంటున్నారు. ఇలా దూరంగా ఉంచే వాటిల్లో పండ్లు కూడా ఒకటి. కానీ కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు పండ్లు పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఏ పండ్లు ఎంత మోతాదులో తీసుకోవాలి అన్న విషయంలో జాగ్రత్త అవసరమని సూచిస్తున్నారు. ముఖ్యంగా శరీరంలో పొటాషియం స్థాయిలు, కిడ్నీ పనితీరు ఆధారంగా పండ్ల ఎంపిక ఉండాలి. సరైన పండ్లను మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. తప్పుగా ఎంపిక చేసుకుంటే హైపర్‌కలేమియా వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది.వేటిని తగ్గించాలి, వేటిని తినాలి..క్రానిక్ కిడ్నీ డిసీజ్ ప్రారంభ దశల్లో కిడ్నీలు సాధారణంగా పనిచేస్తుండటంతో ఎక్కువ రకాల పండ్లను మితంగా తీసుకోవచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం పండ్లు, కూరగాయలు కిడ్నీ రోగుల్లో మూత్రంలో ఆల్బుమిన్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో కిడ్నీ నష్టం వేగం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే కిడ్నీ పనితీరు తగ్గే కొద్దీ పొటాషియం నియంత్రణ చాలా ముఖ్యమవుతుంది. స్టేజ్ 3, స్టేజ్ 4 కిడ్నీ వ్యాధుల్లో అధిక పొటాషియం ఉన్న పండ్లను పరిమితం చేయాలి. అరటి, మామిడి, నారింజ వంటి పండ్లలో పొటాషియం ఎక్కువగా ఉండటంతో వాటిని తగ్గించడం మంచిది. ఆపిల్, పైనాపిల్, జామ వంటి పండ్లు తక్కువ పొటాషియం కలిగి ఉండటంతో మితంగా తీసుకోవచ్చు. కిడ్నీ వ్యాధి తీవ్రమైన దశకు చేరినప్పుడు లేదా డయాలసిస్ తీసుకుంటున్నప్పుడు ఆహార నియంత్రణ మరింత అవసరమవుతుంది. ఈ దశలో యాపిల్, బొప్పాయి, బెర్రీలు వంటి తక్కువ పొటాషియం ఉన్న పండ్లను మాత్రమే పరిమిత మోతాదులో తీసుకోవాలి. సాధారణంగా రోజుకు 100 గ్రాముల వరకు మాత్రమే పండ్లు తీసుకోవడం మంచిది.పండ్ల రసాలు అయితే..అలాగే పండ్లరసాల విషయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం. ఫ్రూట్ జ్యూసుల్లో పొటాషియం, చక్కెర మోతాదులు అధికంగా ఉండే అవకాశం ఉండటంతో వాటిని అధికంగా తీసుకోవడం మంచిది కాదు. తక్కువ పొటాషియం ఉన్న పండ్లను తీసుకున్నా మోతాదు ఎక్కువైతే సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పండ్లను కొలిచి తీసుకోవడం, ఒకేసారి అధికంగా తినకపోవడం అవసరం. మొత్తం ఆహారంలో పండ్ల మోతాదు సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలి. కిడ్నీ రోగులకు పండ్ల ఎంపిక ఇతర ఆరోగ్య పరిస్థితులపై కూడా ఆధారపడి ఉంటుంది. మధుమేహం ఉన్నవారు చక్కెర స్థాయిలను దృష్టిలో ఉంచుకోవాలి. అలాగే శరీరంలో ద్రవాల సమతుల్యత, రక్తంలోని పొటాషియం స్థాయిలను కూడా పరిశీలించి ఆహారం నిర్ణయించుకోవాలి. ఆరోగ్యకరమైనవే అయినా అతిగా వద్దు..పండ్లు ఆరోగ్యకరమైనవే కాబట్టి ఎంతైనా తినొచ్చని భావించడం తప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ప్యాకెట్ జ్యూసులు లేదా తాజా ఫ్రూట్ జ్యూసులను అధికంగా తీసుకోవడం ప్రమాదకరమవుతుంది. వైద్యులు సూచించిన డైట్ నియమాలను తప్పకుండా పాటించాలి. కిడ్నీ వ్యాధి ఉందంటే పండ్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. సరైన ఎంపికతో మితంగా తీసుకుంటే అవి పోషకాహారంలో భాగంగా కొనసాగవచ్చు. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, పరీక్షల ఫలితాల ఆధారంగా ఆహారాన్ని సర్దుబాటు చేసుకోవడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

# చియా గింజలకు, సబ్జా గింజలకు తేడా ఏమిటి.. ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?



ఎండాకాలంలో శరీరాన్ని చల్లగా ఉంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లపై చాలామంది ప్రత్యేక శ్రద్ధ పెడుతుంటారు. అందులో భాగంగా సబ్జా గింజలు, చియా గింజలు వేసిన పానీయాలను వేసవిలో ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. అయితే నీటిలో నానబెట్టిన తర్వాత ఈ రెండు గింజలు ఒకేలా కనిపించినప్పటికీ శరీరంపై చూపే ప్రభావం మాత్రం భిన్నంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచడంలో ఏవి ఎక్కువ ఉపయోగపడతాయనే విషయంపై వారు వివరాలను వెల్లడిస్తున్నారు.తేడాలేంటి..సబ్జా గింజలు తులసి జాతికి చెందిన స్వీట్ బాసిల్ మొక్క నుంచి లభిస్తాయి. వీటిని చాలాకాలంగా ఫలూదా, షర్బత్ వంటి వేసవి పానీయాల్లో ఉపయోగిస్తున్నారు. నీటిలో వేసిన కొన్ని నిమిషాల్లోనే ఇవి విస్తరించి జెల్‌లా మారిపోతాయి. చియా గింజలు మాత్రం సాల్వియా మొక్క నుంచి వస్తాయి. వీటిని సాధారణంగా స్మూతీలు, హెల్త్ డ్రింక్స్, పుడ్డింగ్స్‌లో ఉపయోగిస్తారు. చియా గింజలు కూడా నీటిని పీల్చుకుని జెల్‌లా మారతాయి కానీ పూర్తిగా నానేందుకు ఎక్కువ సమయం పడుతుంది. శరీరాన్ని చల్లబరచడంలో సబ్జా గింజలు ఎక్కువగా ఉపయోగపడతాయని సంప్రదాయ వైద్య విధానాలు చెబుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం బాసిల్‌లో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు శరీర వేడిని తగ్గించడంలో, జీర్ణక్రియను ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడతాయి. అందుకే వేసవిలో నిమ్మరసం, రోజ్ షర్బత్, కొబ్బరి నీటిలో సబ్జా గింజలను కలిపి తీసుకునే అలవాటు ఉంటుంది. అలాగే చియా గింజలు మాత్రం నేరుగా శరీరాన్ని చల్లబరచడంలో కాకుండా పోషక విలువల కోసం ఎక్కువగా గుర్తింపు పొందాయి. వీటిలో ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ మెరుగుదలకు ఇవి సహాయపడతాయని పరిశోధనలు చెబుతున్నాయి.నానబెట్టాకే తినాలి..హైడ్రేషన్ విషయంలో రెండు గింజలూ ఉపయోగకరమే అయినప్పటికీ సబ్జా గింజలు జీర్ణాశయానికి తేలికగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి అధిక ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. సబ్జా గింజలు తమ బరువుకంటే దాదాపు 15 రెట్లు ఎక్కువ నీటిని నిల్వ చేసుకోగలవు. చియా గింజల్లో ఫైబర్ అధికంగా ఉండటంతో అవి ఎక్కువసేపు ఆకలి లేకుండా ఉంచుతాయి. అయితే సరైన విధంగా నానబెట్టకుండా తీసుకుంటే వేసవిలో కొందరికి కడుపు భారంగా అనిపించే అవకాశం ఉంటుంది. పోషక విలువల పరంగా చూస్తే చియా గింజలు ముందుంటాయి. వీటిలో ప్రోటీన్, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్ వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. శక్తిని ఎక్కువసేపు నిల్వ ఉంచడంలో, తృప్తి భావాన్ని కలిగించడంలో ఇవి ఉపయోగపడతాయి. సబ్జా గింజల్లో ప్రోటీన్ తక్కువగా ఉన్నప్పటికీ ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి.వేసవిలో అయితే ఇవి మేలు..వేసవిలో సబ్జా గింజలను నిమ్మరసం, రోజ్ మిల్క్, కొబ్బరి నీరు వంటి తేలికపాటి పానీయాల్లో కలిపి తీసుకోవడం మంచిది. ఇవి 10 నుంచి 15 నిమిషాల్లోనే నానిపోతాయి. చియా గింజలను మాత్రం ఓవర్‌నైట్ డ్రింక్స్, స్మూతీలు, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో ఉపయోగిస్తే మంచిది. శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం ప్రధాన లక్ష్యమైతే సబ్జా గింజలు మంచి ఎంపిక అని చెప్పవచ్చు. పోషక విలువలు, ఫైబర్, ఎక్కువసేపు శక్తి కావాలనుకుంటే చియా గింజలు మెరుగైనవి అని చెప్పవచ్చు. అయితే ఈ రెండింటినీ అవసరానికి అనుగుణంగా వేసవి ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# కేరళ సీఎంగా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం – ఖర్గే, రాహుల్, రేవంత్ హాజరు

**కేరళ:** కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. తిరువనంతపురం లోని సెంట్రల్ స్టేడియంలో కేరళ 13వ సీఎంగా వీడీ సతీశన్? సోమవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. అయితే సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా వచ్చారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ హాజరయ్యారు. 20 మంది మంత్రులు ప్రమాణం సతీశన్‌తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం యూడీఎఫ్ కూటమి పార్టీలతో చర్చల అనంతరం 20 మందికి మంత్రి పదవులను ఖరారు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, కే మురళీధరన్, ఎపీ



అనిల్ కుమార్, సన్నీ జోసెఫ్?తో పాటు ఐయూఎంఎల్‌కు చెందిన పీకే కున్హాల్ కుట్టి, ఎన్ శంషుద్దీన్, కట్టఎం షాజీ, పీకట్ట బషీర్, వీఇ అబ్దుల్ గఫూర్ ఉన్నారు. టీ రాధాకృష్ణన్ స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్ (మహిళ) డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. 11 తర్వాత సీఎంగా సతీశన్ పేరుఅసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేరళ ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ నడిచింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య జరిగిన హోరాహోరీ పోటీ నెలకొంది. దాదాపు 10 రోజులు పాటు మల్లగుల్లాలు, చర్చలు జరిగాయి. మే 14న కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును అధికారికంగా ప్రకటించింది. మే 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంలో రాష్ట్రంలో సీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పూర్తి అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనికి అనుగుణంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా అనేక ఇతర నాయకులతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విస్తృత చర్చలు జరిపారు. ఈ చర్చలన్నింటి ఆధారంగా వీడీ సతీశన్‌ను సీఎల్పీ నాయకుడిగా నియమించాలని నిర్ణయించారు. న్యాయవాది టు సీఎం కొచ్చి సమీప నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది. పదేళ్లు కేరళ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగం కేఎస్‌యూతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2001 నుంచి పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ప్రతిపక్ష నేతగా పినరయి విజయన్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. కేరళ ముఖ్యమంత్రి పదవికి ముగ్గురు సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు సతీశన్ వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపింది. పదేళ్లుగా కేరళలో అధికారానికి దూరమైన పార్టీని విస్తృత ప్రజాబాహుళ్యం మద్దతుతో గెలిపించడంలో సతీశన్ కీలక పాత్ర పోషించారు. విపక్షనేతగా సమర్థంగా పనిచేయడంతో పాటు వామపక్షాల ఆధిపత్యానికి గండికొట్టారు. ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 140 స్థానాలకు గాను 102 స్థానాల్లో అఖండ విజయం సాధించి, మూడింట రెండు వంతుల మెజారిటీని సొంతం చేసుకుంది. ఇందులో కాంగ్రెస్ 63 స్థానాలు గెలుచుకోగా, మిత్రపక్షాలైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఐయూఎంఎల్ 22, కేరళ కాంగ్రెస్ 8, ఆర్ఎస్‌పీ 3 స్థానాల్లో విజయం సాధించాయి.

## మహిళలకు ఉచిత ప్రయాణం, ఉద్యోగులకు పే కమిషన్.. బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు




**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది. కోల్‌కతాలో సోమవారం సీఎం సువేందు అధికారి ఆధ్వర్యంలో రెండోసారి క్యాబినెట్ భేటీ జరిగింది. జూన్ 1వ తేదీ నుంచి పలు పథకాల అమలు చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు .జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది ( ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు . కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఒక్కసారిగా రద్దు చేయబోమని సీఎం సువేందు అధికారి ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.


## మహిళలకు ఫ్రీ బస్సు, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక శాఖ.



**తిరువనంతపురం:** కేరళం ముఖ్యమంత్రిగా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేసిన వీడి సతీశన్ తొలి క్యాబినెట్ సమావేశంలోనే కీలక సంక్షేమ, పాలనా సంబంధిత నిర్ణయాలను ప్రకటించారు. జూన్ 15వ తేదీ నుంచి మహిళలకు కేఎస్ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్టు కూడా ప్రకటించారు. వృద్ధతరం పెరుగుతుండటం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల హెల్త్‌కేర్, సామాజిక భద్రత, పునరావాసం, సంక్షేమ పథకాలను ఈ ప్రత్యేక శాఖ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఆశా వర్కర్లకు రూ.3,000 గౌరవ వేతనం ఆశావర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.3,000కు పెంచుతున్నట్టు కూడా ముఖ్యమంత్రి సతీశన్ ప్రకటించారు. కేరళం హెల్త్‌కేర్ సిస్టంలో ఆశా వర్కర్ల చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వర్కర్లు, హెల్పర్లకు రూ.1,000 చొప్పున వేతనం పెంచుతున్నామని, పాఠశాలల్లో వంటపనులు చేస్తున్న వారు, సహాయక సిబ్బంది, ప్రీ-ప్రైమరీ టీచర్లకు అదనంగా రూ.1,000 వేతనం పెంచుతున్నామని చెప్పారు. దాడులపై సిట్2023 నవ కేరళం యాత్ర సందర్భంగా యువజన కాంగ్రెస్ నేతలపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం సతీశన్ ప్రకటించారు. నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని, రుణాలు, వ్యయం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పారదర్శకతకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

## బీజేపీ ఎమ్మెల్యే ఫోన్ లాక్కెళ్లిన దొంగలు- అమిత్ షా పర్యటన వేళ ఛత్తీస్‌గఢ్‌లో రాజకీయ దుమారం

**ఛత్తీస్‌గఢ్:** సీనియర్ బీజేపీ నేత, ఎమ్మెల్యే ధరమ్‌లాల్ కౌశిక్ సోమవారం మార్నింగ్ వాక్ చేస్తుండగా, మోటార్ సైకిల్?పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆయన మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లారు. ఈ ఘటన రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితులపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగడానికి కారణమైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్‌లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన సమయంలో ఈ ఘటన జరగడం గమనార్హం. దీనితో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ సర్కార్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించింది. తాజా చోరీ ఘటన, రాష్ట్రంలో సుపరి పాలన చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వానికి ఒక చెంపపెట్టు లాంటిదని విమర్శించింది. చోరీ చేశారిలా!"సివిల్ లైన్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని పీడబ్ల్యూడీ పైవంతెన (ఫ్లైఓవర్)పై బీజేపీ ఎమ్మెల్యే ధరమ్‌లాల్ కౌశిక్ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ సమయంలో బైక్‌పై వచ్చిన దొంగలు ఆయన చేతిలోని మొబైల్ ఫోన్‌ను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న



వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితులను గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం" అని పోలీసులు తెలిపారు. మరోవైపు, ధరమ్‌లాక్ కౌశిక్ ఈ ఘటన గురించి మీడియాతో మాట్లాడారు. తన ఫోన్?ను దొంగలు చోరీ చేసిన విషయం నిజమేనని ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించామని, వారు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. లెంపకాయ కొట్టారు! ఈ చోరీ ఘటనపై రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత భూపేశ్ బఘేల్ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "కేంద్ర హోంమంత్రి అమిత్? షా ఛత్తీస్‌గఢ్‌లో పర్యటిస్తున్న సమయంలో, వ్యాహ్యాళికి (మార్నింగ్ వాక) చేస్తున్న ఎమ్మెల్యే ఫోన్ చోరీకి గురికావడం, ఇక్కడి కంటితుడుపు సుపరిపాలన ముఖంపై లెంపకాయ లాంటిది" అని మండిపడ్డారు. "రాష్ట్రంలో అన్ని చోట్లా దొంగతనాలు, కత్తిపోట్లు, హత్యలు, దోపిడీలు బాగా పెరిగిపోయాయి. మరోవైపు రాష్ట్ర చరిత్రలోనే అత్యంత అసమర్థుడైన హోంమంత్రి మాత్రం సోషల్ మీడియా రీల్స్? చేస్తూ, స్వాగత సత్కారాల వేడుకల్లో బిజీగా ఉన్నారు" అని భూపేశ్ బఘేల్ విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్‌సాయి అధికారిక హ్యాండిల్ నుంచి హోంమంత్రి అమిత్ షా రాయ్‌పుర్‌లో 'సీజీ డయల్? 112' అత్యవసర సేవల వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన వీడియోను పోస్టు చేశారు. భూపేశ్ బఘేల్? ఈ వీడియోను కూడా తన ఎక్స్ పోస్టులో పెట్టి, కింద ఆసక్తికరమైన వాక్యాలు రాశారు. "ఇక్కడ మీరు డయల్ 112 వాహనాలకు జెండా ఊపుతూనే ఉండండి, అక్కడ మాత్రం దొంగలు ధరమ్‌లాల్ కౌశిక్ మొబైల్ ఫోన్‌ను లాక్కొని పారిపోయారు" అంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు ఈ ఘటన కేవలం మొబైల్ దొంగతనానికి సంబంధించిన ఘటన మాత్రమే కాదని, రాష్ట్ర ప్రభుత్వ, హోంశాఖ వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్? మీడియా విభాగం స్టేట్ ప్రెసిడెంట్? సుశీల్ ఆనంద్ శుక్లా ఆరోపించారు. రాష్ట్రంలో నేరగాళ్లు అదుపుతప్పి ప్రవరిస్తున్నారని, మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. అంతేకాదు మాదకద్రవ్యాల అక్రమ రవాణా బహిరంగంగా జరుగుతోందని, కత్తిపోట్ల ఘటనలు నిరంతరం జరుగుతున్నాయని అన్నారు. అయినప్పటికీ ఈ నేరాలను అరికట్టడంలో బీజేపీ సర్కార్ పూర్తిగా విఫలమవుతోందని విమర్శించారు.

## యూఏపీఏకేసుల్లోనూ బెయిలే రూల్- జైలు మినహాయింపు

ఉగ్రవాద నిరోధక చట్టం యూఏపీఏ కసుల్లో కూడా బెయిలే రూల్, జైలు మినహాయింపు అనే రాజ్యాంగ సూత్రం వర్తిస్తుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. జమ్మూకశ్మీర్‌కు చెందిన నార్కో- టెరర్ కేసు నిందితుడు సయ్యద్ ఇఫ్తిఖార్ అంద్రాబీకి బెయిల్ మంజూరు చేస్తూ ఆ వ్యాఖ్యలు చేసింది. యూఏపీఏ కింద కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ, విచారణ ఆలస్యం పేరుతో వ్యక్తిని నిరవధికంగా జైలులో ఉంచలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. అంద్రాబీ తన పాస్‌పోర్ట్‌ను సమర్పించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 2020లో నమోదు చేసింది. యూఏపీఏతో పాటు ఐపీసీ వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు పెట్టుకుని, డ్రగ్స్ స్మగ్లింగ్ ద్వారా వచ్చిన డబ్బును ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించారనే ఆరోపణలు నిందితులపై ఉన్నాయి. యూఏపీఏ సెక్షన్‌పై కీలక వ్యాఖ్యలుయూఏపీఏ చట్టంలోని సెక్షన్ 43ఀ(5) ప్రకారం బెయిల్ మంజూరుకు కఠిన పరిమితులు ఉంటాయి. అయితే ఈ సెక్షన్‌ను



ఆధారంగా చేసుకుని ఎవరినైనా నిరవధికంగా జైలులో ఉంచడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 22ల ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయపరమైన హక్కులు రక్షించబడాలని పేర్కొంది. బెయిల్ రూల్ జైలు ఎక్సెప్షన్ అనేది రాజ్యాంగ సూత్రం. 'నిర్దోషిత్వ భావన ప్రతి నాగరిక సమాజానికి మూలస్తంభం. యూఏపీఏ కేసుల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే కేసు పరిస్థితులను బట్టి అవసరమైతే బెయిల్ నిరాకరించే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది. కేఏ నజీబ్ తీర్పు బైండింగ్ 2021లో వచ్చిన కేఏ నజీబ్ తీర్పును సుప్రీం కోర్టు మరోసారి ప్రస్తావించింది. విచారణలో అధిక ఆలస్యం జరిగితే యూఏపీఏ కేసుల్లో కూడా బెయిల్ మంజూరు చేయవచ్చని ఆ తీర్పులో పేర్కొన్న సంగతి తెలిసిందే. అదే తీర్పు దేశవ్యాప్తంగా అన్ని కోర్టులకు బైండింగ్ అని తాజా తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మాత్రమే కాకుండా సుప్రీంకోర్టు చిన్న బెంచ్‌లు కూడా ఆ తీర్పును పక్కన పెట్టలేవని పేర్కొంది. ఈ సందర్భంగా దిల్లీ అల్లర్ల కేసుకు సంబంధించిన గల్ఫిషా ఫాతిమా కేసులో వచ్చిన తీర్పుపై కూడా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ తీర్పులో కేఏ నజీబ్ నిర్ణయాన్ని సరైన రీతిలో అనుసరించలేదని వ్యాఖ్యానించింది. దిల్లీ అల్లర్ల కేసు ప్రస్తావనదిల్లీ అల్లర్ల కేసుల్లో కొందరు నిందితులకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ, కార్యకర్తలు ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లకు మాత్రం ఉపశమనం లభించలేదు. ఈ నేపథ్యంలో యూఏపీఏ కేసు ల్లో బెయిల్ అంశంపై గత కొంతకాలంగా న్యాయవర్గాల్లో చర్చ కొనసాగుతోంది. తాజా తీర్పుతో మరోసారి ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. కేసు వివరాలు ఇలా! ఎన్ఐఏ దర్యాప్తు ప్రకారం, 2020 జూన్ 11న హంద్వారాలోని క్రైరో బ్రిడ్జ్ వద్ద పోలీసులు అబ్దుల్ మొమిన్ పీర్ కారును తనిఖీ చేశారు. ఆ సమయంలో రూ.20.01 లక్షల నగదు, రెండు కిలోల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని అరెస్ట్ చేశారు. అతడి విచారణలో వచ్చిన సమాచారంతో సయ్యద్ ఇఫ్తిఖార్ అంద్రాబీ, ఇస్లాం-ఉల్-హక్ పీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరు పాకిస్థాన్‌లోని సహచరుల నుంచి హెరాయిన్ సేకరించి జమ్మూకశ్మీర్‌తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసినట్లు దర్యాప్తులో తేలిందని ఎన్ఐఏ తెలిపింది. అలాగే అంద్రాబీ, అబ్దుల్ మొమిన్ పీర్‌లు 2016-17 మధ్య పాకిస్థాన్‌కు పలుమార్లు వెళ్లినట్లు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. అక్కడ లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థల కార్యకర్తలను కలిసినట్లు ఆరోపించింది. డ్రగ్స్ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించినట్లు చార్జ్‌షీట్‌లో ఎన్ఐఏ పేర్కొంది. అయితే విచారణ ఇంకా పూర్తికాకపోవడం, దీర్ఘకాలంగా నిందితుడు జైలులో ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తాజా తీర్పు యూఏపీఏ కేసుల్లో భవిష్యత్తులో బెయిల్ పిటిషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## 6 నెలల్లో టీవీకే ప్రభుత్వం కుప్పకూలుతుంది.. డీఎంకే ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు..



**చెన్నై, మే 18:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, టీవీకే ప్రభుత్వంపై డీఎంకే పార్టీ సీనియర్ నేత, తిరుచెందూర్ ఎమ్మెల్యే అనిత రాధాకృష్ణన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టీవీకే ప్రభుత్వం ఆరు నెలల కంటే ఎక్కువ అధికారంలో ఉండదని అన్నారు. మళ్లీ డీఎంకే పార్టీనే అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఆదివారం దక్షిణ తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇంకో నాలుగు నెలలు మాత్రమే టీవీకే ప్రభుత్వం ఉంటుంది. అధవ్ అర్జున అనే వ్యక్తికి ధైర్యం ఉంటే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి'. 'నేను కూడా రాజీనామా చేస్తా. ఇద్దరం తిరుచెందూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేద్దాం. ఇది మా పట్టణం. ఎవరినైనా ఓడిస్తాం. మా బాస్ ఎంకే స్టాలిన్ తిరుచ్చి నుంచి పోటీ చేయాలని కోరుకుంటున్నా. స్టాలిన్ కొలతూర్‌ను సింగపూర్‌లా మార్చారు. నాలుగు నెలలు లేదా ఆరు నెలల తర్వాత మళ్లీ బాస్ ముఖ్యమంత్రి అవుతారు' అని అన్నారు. టీవీకే, డీఎంకే పార్టీల మధ్య రాజకీయ పోరు ఊపందుకున్న ఈ సమయంలో అనిత రాధాకృష్ణన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై టీవీకే పార్టీ కానీ, అధవ్ అర్జున కానీ స్పందించలేదు. ట్రెండ్ సెట్ చేస్తున్న విజయ్. విజయ్ ముఖ్యమంత్రిగ బాధ్యతలు చేపట్టిన తర్వాత పాత సంప్రదాయానికి గుడ్‌బై చెప్పారు. అచ్చం ఒక ప్రభుత్వ అధికారి తరహాలో వ్యవహరిస్తున్నారు. విజయ్ అంతకుముందు వరకు తెల్లచొక్కా, కలర్‌ప్యాంటుతో కనిపించేవారు. ప్రమాణ స్వీకారం నుంచి డ్రెస్ మార్చేశారు. వైట్‌షర్ట్‌పై బ్లాక్ బ్లేజర్, బ్లాక్ ప్యాంటు ధరిస్తున్నారు. ఆఫీస్ టైమ్‌కు పావుగంట ముందే ఆఫీస్‌కు వస్తున్నారు. తన చాంబర్‌లోనే మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు. మళ్లీ విధులకు హాజరవుతున్నారు.

## అన్నాడీఎంకేలో అంతర్గత పోరు.. సీనియర్ నేత సెమ్మలై రాజీనామా

**చెన్నై:** అన్నాడీఎంకేకు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎస్.సెమ్మలై రాజీనామా చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటమి చవిచూడటం, పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో సెమ్మలై రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది. జయలలిత మరణం తర్వాత పార్టీలో పెరుగుతున్న వర్గపోరు, సీనియర్లకు సరైన గుర్తింపు లేకపోవడంతో మనస్తాపం చెంది రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. తన రాజీనామా లేఖను పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి పంపారు. పార్టీలో ఇటీవల తలెత్తిన పరిణామాలపై సెమ్మలై తన రాజీనామా లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీని ఎంతో ఉన్నత స్థితికి తీసుకువెళ్లిన రివల్యూషనరీ నేత ఎంజీఆర్, అమ్మ (జయలలిత) ఇలాంటి పరిణామాలను ఎన్నడూ ఊహించి ఉండరని, పార్టీలోని అంతర్గత కలహాలపై మీడియాలో వస్తున్న కథనాలు కూడా పార్టీ దిగజారుడు పరిస్థితికి అద్దంపడుతున్నాయని అన్నారు. జయలలిత మరణాంతరం తనను పక్కకు పెట్టేశారని, అయినప్పటికీ తన మనోభావాలను బయటపెట్టకుండా క్రమశిక్షణతో పార్టీలో కొనసాగుతూ వచ్చానని చెప్పారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకెంతమాత్రం పార్టీలో కొనసాగేందుకు తన మనసు అంగీకరించడం లేదన్నారు.

## యూఏఈ అణు విద్యుత్ కేంద్రంపై డ్రోన్ దాడిని ఖండించిన భారత్

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని బరాకా అణు విద్యుత్ కేంద్రం సమీపంలో జరిగిన డ్రోన్ దాడిపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనను ప్రమాదకరమైన ఉద్రిక్తతగా అభివర్ణించింది. ఇరు పక్షాలు తక్షణమే సంయమనం పాటించాలని కోరింది. ఇటువంటి చర్యలు (దాడులు) ఆమోదయోగ్యం కావని స్పష్టం చేసింది. అన్ని పక్షాలు చర్చలు, దౌత్యం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించింది. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అందరూ సంయమనం పాటించాలి : ఐఏఈఏ పిలుపుఅంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) సైతం యూఏఈలోని అణు విద్యుత్ కేంద్రంపై జరిగిన డ్రోన్ దాడిపై స్పందించింది.



ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అణు భద్రతకు ముప్పు కలిగించే సైనిక చర్యలు ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడింది. అణు ప్రమాదాన్ని నివారించడానికి ఏ అణు విద్యుత్ కేంద్రం వద్ద దాడులు వద్దని, సంయమనం పాటించాలని సూచించింది. బరాకా అణు విద్యుత్ ప్లాంట్‌లో రేడియేషన్ స్థాయిలు సాధారణంగానే ఉన్నాయని తెలిపింది. "బరాకా అణు విద్యుత్ కేంద్రంలోని ఒక విద్యుత్ జనరేటర్‌పై డ్రోన్ దాడి కారణంగా మంటలు చెలరేగాయని యూఏఈ మాకు తెలియజేసింది. ఆ తర్వాత అక్కడ రేడియేషన్ స్థాయిలు సాధారణంగానే ఉన్నాయని చెప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని తెలియజేసింది. ప్రస్తుతం అత్యవసర డీజిల్ జనరేటర్లు అణు విద్యుత్ కేంద్రం యూనిట్ 3కి విద్యుత్‌ను అందిస్తున్నాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఈ పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. అవసరమైతే సహాయం అందించడానికి సిద్ధంగా ఉంది. యూఏఈ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. " అని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. మరోవైపు, తమ దేశంలోని బరాకా అణు విద్యుత్ కేంద్రం టార్గెట్‌గా జరిగిన శాఖ సోమవారం ప్రకటన విడుదల చేసింది. బరాకా ప్లాంట్ పరిసరాలను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకోవడాన్ని ఖండించింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని పేర్కొంది. ఈ దాడులు ప్రమాదకరమైన ఉద్రిక్తతను పెంచుతాయని, ఇది ఆమోదయోగ్యం కాని దురాక్రమణ చర్యగా అభిప్రాయపడింది.

# సంక్షోభాల సృష్టికర్తలు...మన పాలకులు !

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి.

అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని



ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు.

ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పలుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.






# నదుల అనుసంధానానికి ఆద్యుడు కె.ఎల్.రావ్

- పట్టిసీమ 5ఏళ్లలోనే 50వేల కోట్ల సంపద సృష్టించింది.
- కె.ఎల్. రావ్ వర్ధంతి వేడుకల్లో మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి,మే18:** భారతదేశ నీటిపారుదల చరిత్రను మార్చిన హీరాకుడ్, భాక్రానంగల్, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి బహుళార్ధక సాధక ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర వహించిన మహోన్నత వ్యక్తి ప్రముఖ ఇంజనీర్ కె.ఎల్. రావు అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. సోమవారం అమరావతి సచివాలయంలో పద్మభూషణ్ డాక్టర్. కె.ఎల్ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్. కె.ఎల్ రావు సేవలు అందరికీ స్ఫూర్తి దాయకం, ఆదర్శనీయం అని అన్నారు.ఈ రోజు అందరం మాట్లాడుకుంటున్న నదుల అనుసంధానం గురించి, దేశంలో మొదటి సారిగా ప్రతిపాదించిన వ్యక్తి కె.ఎల్.రావు అని అన్నారు. అందుకే ఆయన మనకు ఒక స్ఫూర్తి అని మంత్రి నిమ్మల తెలిపారు. దేశంలో కరువు కాటకాలు పోవాలంటే నదుల అనుసంధానం ఒక్కటే మార్గమని, గంగా, మహానది, గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి, వంటి నదుల అనుసంధానంతోనే సాధ్యమౌతుందని ప్రగాఢంగా నమ్మిని వ్యక్తి కె.ఎల్ రావు అని అన్నారు.కె.ఎల్ రావు స్ఫూర్తిని నాడు వాజ్‌పేయ్, నేడు ప్రధాని మోధీ అందిపుచ్చుకున్నారని, ముఖ్యంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పట్టి సీమ నిర్మాణం ద్వారా గోదావరి నుండి కృష్ణాకు గోదావరి జలాలను తరలించి నదుల అనుసంధాన కార్యక్రమానికి భీజం వేశారని తెలిపారు. నాడు 1300 కోట్లతో పట్టిసీమ నిర్మిస్తే, 5ఏళ్ళలోనే 50వేల కోట్ల ఆదాయం సృష్టించిందని స్పష్టం చేశారు. భవిష్యత్ లో కూడా కె.ఎల్ రావు గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేలా, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సుభిక్షం చేసేలా చంద్రబాబు పని చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, జలవనరుల శాఖ సలహాదారులు వెంకటేశ్వరరావు, ఈఎన్సీలు నరసింహమూర్తి, వరప్రసాద్, సిఈలు,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అధిక జేష్ఠం..ఆరంభం

**- శుభకార్యాలకు అనువు కాదు**

**తిరుపతి,మే18:** ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ఆరంభమయ్యింది. అధిక మాసం అంటే అనే సందేహాలు వస్తుంటాయి. ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. హిందూ పంచాంగం చంద్రుడి గమనాన్ని అనుసరిస్తుంది, అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ సూర్యుని ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన సంవత్సరం సుమారు 354 రోజులు ఉండగా, సౌర సంవత్సరం 365 రోజులు ఉంటుంది. ఈ రెండు మధ్య వచ్చే వ్యత్యాసం వల్ల ప్రతి సంవత్సరం 10,11 రోజుల తేడా ఏర్పడుతుంది. ఈ తేడా ఒక నెలకు చేరినప్పుడు, సుమారు మూడు సంవత్సరాలకు ఒకసారి అదనపు నెలను జోడిస్తారు. దానినే అధిక మాసం అంటారు. ఇది కాలమానం సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మతపరంగా ఇది ఆధ్యాత్మిక సాధనకు అత్యుత్తమ సమయంగా భావించబడుతుంది. ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం అయ్యింది. 'అసంక్రాంతి మాసో అధికమాసః' అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక



రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు. పురాణ కథల ప్రకారం, ఈ అదనపు మాసాన్ని మొదట మల మాసం అని పిలిచేవారు. దానిని శుభకార్యాలకు అనుకూలంగా భావించలేదు. ఏ దేవుడు కూడా దీనికి అధిపతిగా ఉండటానికి ముందుకు రాలేదు. అప్పుడు శ్రీమహావిష్ణువు.. తన పేరు అయిన 'పురుషోత్తమ'ను దీనికి ఇచ్చాడు. అప్పటి నుండి ఇది 'పురుషోత్తమ మాసం'గా ప్రసిద్ధి చెందింది. ఈ మాసంలో విష్ణువును ఆరాధిస్తే అనేక రెట్లు పుణ్యఫలాలు లభిస్తాయని విశ్వాసం. చైత్రం నుండి ఆశ్వయుజ మాసం (మార్చి-అక్టోబర్) మధ్య కాలంలో ఏ నెలలో సూర్య సంక్రమణం (సూర్యుడు కొత్త రాశిలోకి ప్రవేశించడం) జరగదో, ఆ నెల అధిక మాసంగా పరిగణించబడుతుంది...మళ్ళీ 2029 సాధారణ నామ సంవత్సరంలో చైత్ర మాసము అధిక మాసం వస్తుంది..

# ఇమ్రాన్ పదవీచ్యుతిలో అమెరికా పాత్ర

**- సంతచలనం కలిగిస్తున్న తాజా వార్తలు**

**ఇస్లామాబాద్,మే18:** ప్రపంచ దేశాలను అల్లకల్లోలంలోకి నెట్టడం అమెరికా నిత్యం చేస్తూనే ఉంటుంది. తన పట్టును కొనసాగించేందుకు అమెరికా చేయని పనులు లేవు. దానికి సలాం అనకుంటే ఆయా దేశాలను అతలాకుతలం చేస్తుంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు ఇలా విలవిల్లాడినవే. మనదేశంలోనూ వేలుపెట్టపోయి చేతులు కాల్చుకుందని చెబుతారు. తాజాగా పాక్‌లోనూ ఇలాంటి చర్యలకు దిగినట్లు తాజా వార్తలు రుజువు చేస్తున్నారు. పాక్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందని వెల్లడించే రహస్య దౌత్య సమాచారం తాజాగా లీక్ అయ్యింది. దీనికి సంబంధించిన అసలు పత్రాన్ని ఇన్వెస్టిగేటివ్ పత్రిక డ్రాప్ సైట్ ప్రచురించింది. ఇందులో వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022, ఏప్రిల్‌లో ఇమ్రాన్‌ఖాన్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అంతకు ముందు అమెరికాలోని పాకిస్థాన్ రాయబారి అసద్ మజీద్ ఖాన్‌తో అమెరికా హోంశాఖలోని



దక్షిణ- మధ్య ఆసియా వ్యవహారాల సహాయ కార్యదర్శి డోనాల్డ్ లూ సమావేశమయ్యారు.

అందులో వారు ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించి జైల్లో పెట్టాలని.. అప్పుడే అమెరికా-పాక్ బంధం మరింత బలపడుతుందని చర్చించుకొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి వైదొలగడంతో షెహబాజ్ షరీఫ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం విషయంలో ఇమ్రాన్‌ఖాన్ తటస్థ వైఖరి కారణంగానే ఆయన్ను ప్రధాని పదవి నుంచి తప్పించాలని అమెరికా నిర్ణయించినట్లు పాకిస్థాన్‌లో లీకైన దౌత్య సమాచారం వెల్లడించింది. పాక్ రాయబారి, అమెరికా ప్రభుత్వాధికారుల మధ్య భేటీకి ముందు.. ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. తనను పదవి నుంచి తొలగించడానికి స్థానిక పార్టీలు, అధికారులతో కలిసి అమెరికా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కాగా ఆయన వ్యాఖ్యలను పాక్ ప్రభుత్వం, అమెరికా ఖండించాయి. అనంతరం తోషాఖానా కేసులో ఆయనకు జైలు శిక్ష పడింది. నాటినుంచి ఇమ్రాన్ జైల్లోనే ఉన్నారు. ఇటీవల ఆయనపై హత్యాయత్నం కూడా జరిగిందని వార్తలు వచ్చాయి. మొత్తంగా అమెరికా తీరుతో ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు.

# స్వర్గానికి నిచ్చెన

ఉపవాసం చేసిన వారికి..
దేవుడు ఆనందాన్ని ప్రసాదిస్తే..
ఈ ప్రపంచంలో ఉపవాసం చేస్తున్న..
పేదలంతా ఆనందంగా ఉన్నారా..
దురాలోచనలకు చేయాలి ఉపవాసాలు
సమాలోచనలకు సదా పట్టం కట్టాలి !

కోయిలకు స్వరం ఇచ్చి అందం తీసేసాడు
నెమలికి అందానిచ్చి అడవిలో వదిలేసాడు
నరుడికి ధనానిచ్చి దానగుణం మరిచాడు
కుర్రాళ్లకు సెల్‌ఫోన్లనిచ్చి చదువు లాక్కున్నాడు
నీకు విద్యనిచ్చి వినయాన్ని మాయం చేశాడు
నాకు మెదడునిచ్చి విచక్షణ వదిలేసాడు

యువతకు చదువునిచ్చి సంస్కారం మరిచాడు
మనిషికి జన్మనిచ్చి మానవత్వాన్ని దూరం చేశాడు !

మట్టిలోంచి వచ్చిన మనిషి..
చివరకు మన్నులో కలవాల్సిందే
ఒకటి ఇస్తే మరొకటి ఇవ్వడు
అడిగినవన్నీ ఇస్తే మనిషి ఆగుతాడా..
అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తాడు
కాలరెగిరేసి స్వర్గానికి నిచ్చెన వేస్తాడు
చావు తెలివిని సదా చూపిస్తాడు !

మధుపాలీ

# క్యాసారం బీరప్పల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్ చెరు** :గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండల పరిధిలోని క్యాసారం గ్రామంలో సోమవారం నిర్వహించిన బీరప్పల జాతరలో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, ప్రభాకర్, ఈశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 20న జిన్నారం మండలంలో మెడికల్ షాపుల బంద్



**పటాన్ చెరు** :జిన్నారం మండలం లోని మెడికల్ షాపులను ఈ నెల 20వ తేదీన బంద్ చేనున్నట్లు మండల అసోసియేషన్ ఈసీ మెంబర్ కొండి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మెడికల్ షాపుల బంద్ పై తాసిల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి అసోసియేషన్ సభ్యులతో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కెమిస్ట్ డ్రగ్గిస్ట్ సమస్యలపై దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బందును పాటిస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ ఔషధాల విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ బందులో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్పోరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్లతో మెడిసిన్లు అమ్మడాన్ని నిలిపివేయాలన్నారు. ఫార్మసీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న కీలక సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి విన్నవించిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బందుకు మద్దతిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామాంజనేయులు, నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పాఠ్యపుస్తకాల్లో మార్పులు ఇవే...

**శెట్టూరు మండలం మే 18.**ఈ ఏడాది కొత్తగా ఐదోతరగతిలో హిందీని ప్రవేశపెట్టారు.ఇప్పటివరకు ఆరోతరగతి నుంచి ఉండగా.. ఐదో తరగతిలో అక్షరాలు, చిన్న పదాలు చెప్పేందుకు చేర్చారు.ఒకటో తరగతి నుంచే ఆంగ్లం ఫోనెటిక్స్ను ప్రవేశపె ట్టారు. అక్షరాలకు, వాటి శబ్దాలకు మధ్య సంబంధాన్ని నేర్పనున్నారు.తొమ్మిదో తరగతి పాఠ్యపుస్తకాల్లో సామర్థ్య ఆధారిత మూల్యాంకనానికి అనుగుణంగా ప్రశ్నలను చేర్చారు.తొమ్మిది ఆంగ్ల పాఠ్యపుస్తకం యూనిట్-8లో 'ఒక గాఢనిద్ర నా ఆత్మను కప్పేసింది', యూనిట్-9లో 'నేను నీ స్థానంలో ఉంటే', సప్లిమెంటరీ రీడర్లో 'ఇల్లు అంటే కేవలం ఒక గూడు కాదు' పాఠాలను తొలగించారు. తొమ్మిదోతరగతి తెలుగు వాచకం నుంచి హరివిల్లు, రంగస్థలం పాఠం, ఉపవాచకం నుంచి న్యాపతి సుబ్బా రావు, కొండా వెంకటప్పయ్య, దిగుమర్తి జానకిబా యమ్మ, కల్లూరి తులసమ్మ పాఠ్యాంశాలు తొలగించారు.పదోతరగతి ఆంగ్ల పాఠ్యపుస్తకం యూనిట్-6లో 'మిజ్బాల్ ది ఆటర్', 'ఫాగ్', యూనిట్-7లో 'ఫర్ ఆన్ గ్రెగరీ', యూనిట్-9లో 'ది ప్రపోజల్', సప్లిమెంటరీ రీడ ర్లో 'భూమిని రక్షించిన పుస్తకం' పాఠం తొలగించారు.

# ఇంటర్ ప్రవేశానికి రెండు రోజులే గడువు.....



**దేవీపట్నం**
పోలవరం జిల్లాలో 8 గురుకుల కళాశాలల్లో ప్రథమ ఇంటర్ ప్రవేశానికి అప్లై చేసుకునేందుకు ఈనెల 20 తో గడువు ముగుస్తుందని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రుక్మంగదయ్య సోమవారం తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు ఆన్లైన్లో మాత్రమే అప్లై చేసుకోవాలన్నారు. మొత్తం 1,030 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 27న రంపచోడవరంలో కౌన్సిలింగ్ ద్వారా మెరిట్ ప్రకారం కళాశాలలో కేటాయిస్తామన్నారు.

## ఏలూరు బాలలగ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం. శోభ చే విద్యార్థుల చేత నీతి కథలను చదివించుట, రిసోర్స్ పర్సన్ జి రాధిక గారిచే యోగా క్లాస్.



**ఏలూరు, మే 18** ఇందులో భాగంగా ప్రతిరోజు యోగా చేయడం వలన అనేక వ్యాధుల నుండి రక్షించుకోగలమని, యోగ శారీరకంగా, మానసికంగా దృఢంగా మారుస్తుందని. విద్యార్థి దశ నుంచి యోగాని ప్రతిరోజు మన జీవన శైలిలో ఒక భాగంగా మార్చుకోవాలని వారు తెలియజేశారు. కే ఎన్ ఎన్ నైమిష గారిచే జీకే క్లాస్, ఎం లక్ష్మీ గారిచే మెడిటేషన్ క్లాస్ అనంతరం క్యారమ్స్ మరియు చెస్ గేమ్స్ ఆడించడం, విరామ సమయంలో స్నాక్స్ అందించడం జరిగింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ నిర్వాహకురాలు మణిపూరి శోభ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడమైనది.

# ప్రేగు వాపు సంబంధ వ్యాధులు ప్రమాదకరం

**(19 మే "ప్రపంచ ప్రేగు వాపు (తాపజనక) వ్యాధుల దినం" సందర్భంగా)**

ప్రపంచవ్యాప్తంగా "ప్రేగు వాపు సంబంధ (తాపజనక) వ్యాధులు" లేదా "ఇన్ఫ్లమేటరీ బొవెల్ డిసీజెస్" క్రమంగా పెరగడం ఒక ప్రజారోగ్య హెచ్చరికగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యమైన ప్రేగు వాపు వ్యాధుల్లో "అల్సరెటివ్ కోలిటిస్", "క్రోన్స్ వ్యాధి" వస్తాయి. ఈ ప్రేగు సంబంధ వ్యాధుల బారిన పడడంతో కుటుంబాలు ఆర్థిక పతనం కావడమే కాకుండా దీర్ఘకాలిక చికిత్సల అవసరం అవుతాయి. పాశ్చాత్య దేశాల్లో ఆహారపు అలవాట్ల కారణంగా అధికంగా నమోదు అవుతున్న ప్రేగు వాపు వ్యాధులు నేడు ఆసియా దేశాలకు కూడా క్రమంగా విస్తరించడం గమనిస్తున్నాం. వయో పరిమితులు లేని ఈ వ్యాధులను నిర్లక్ష్యం చేసినా, రోగ నిర్ధారణ ఆలస్యం అయినా ప్రమాదకరంగా మారుతుంది.

ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం-2026 ఇతివృత్తం:
ప్రేగు వాపు సంబంధ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 19 మే రోజున "ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం" లేదా "వరల్డ్ ఇన్ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం ఇతివృత్తంగా "సరిహద్దులు లేని ప్రేగు వాపు వ్యాధులు : అందరికీ ఆరోగ్య సురక్ష" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రారంభంలోన రోగ నిర్ధారణ చేసుకోవడం ఒక ఉత్తమమైన మార్గంగా నిలుస్తుంది. అన్ని అపోహలను అధిగమించి పది మందిలో ప్రేగు వాపు వ్యాధుల పట్ల చర్చించుకోవడం వల్ల అవగాహన పెరుగుతుంది.

ప్రేగు వాపు వ్యాధులకు కారణాలు, రోగ లక్షణాలు, నివారణ మార్గాలు:
సాధారణంగా మనం తీసుకునే ఆహారమా మన ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి కారణంగా నిలుస్తుంది. కొవ్వులు, చక్కెరలు, రిఫైన్డ్ పిండి పదార్థాలు, తీపి శీతలపానీయాలు, జంతు సంబంధ ఆహారాలు, ఆల్కహాల్ సేవనం, నిల్వ ఉంచడానికి లేదా రంగులు రావడానికి ఆహార పదార్థాల్లో కలిపే రసాయాలు అతిగా వాడడం, అధిక కారం ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ప్రేగు వాపు వ్యాధులు పెరుగుతాయి. తాజా పండ్లు, మొలకలు, కూరగాయలు, పీచు పదార్థాలు, అధికంగా నీరు తాగడం, కలిగిన ఆహార పదార్థాలు ఆరోగ్య ప్రదాయినిలుగా నిలుస్తాయి. ప్రేగు వాపు వ్యాధుల లక్షణాల్లో ప్రేగుల్లో అల్సర్లు లేదా పుండ్లు ఏర్పడడం, మలంలో రక్తం పడడం, బరువు తగ్గడం, కడుపు నొప్పి, దీర్ఘకాలం పాటు విరోచనాలు కావడం, అలసట, ప్రేగు గోడల కణజాలం వాపు కనిపించడంతో లాంటివి కనిపిస్తాయి.
మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. మన జీవనశైలి మన రోగ నిరోధకతను ప్రభావితం చేస్తుంది. రోగ చికిత్స కన్న రోగ నివారణే మిన్న అనే నినాదం మన నిత్య మంత్రం కావాలి. ప్రేగు పడవాపు వ్యాధుల కట్టడికి ఆహార నియమాలను పాటిస్తూ, దురలవాట్లకు దూరంగా ఉంటూ సుఖ జీవనయానం చేయాలి. ఆరోగ్యకర పౌర సమాజ స్థాపనకు మన వంతు బాధ్యతలను నిర్వహించాలి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# భజన క్లబ్బింగ్ వేదికగా ఆధ్యాత్మిక పరమానందంలో జెన్-జీ యువత

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 130వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో ఇటీవల విస్తృతంగా విస్తరిస్తున్న వినూత్న నిశ్శబ్ద విప్లవం "భజన క్లబ్బింగ్" సంస్కృతి గురించి ప్రస్తావించి జెన్-జీ యువత (1997 - 2012 మధ్య జన్మించిన యువత) ఆస్వాదిస్తున్న సరికొత్త ప్రక్రియను ప్రశంసించారు. 2024-25లోనే ప్రారంభమైన ఈ కల్చర్ ద్వారా యువత తమ మూలాలను మరిచిపోకుండా తమదైన ఆధునిక శైలిలో ఆధ్యాత్మిక పరమానందాన్ని ఆస్వాదించడం శుభ పరిణామం. మత్తుపానీయాలకు బదులు భక్తి పాటలకు డ్యాన్స్ చేస్తూ మానసిక ఒత్తిడిని జయిస్తున్నారు. కరోనా విపత్తు తర్వాత యువత మానసిక స్థితిలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ఒంటరితనం,డిప్రెషన్, కెరీర్ టెన్షన్‌ల మధ్య నలిగిపోతున్న జెన్-జీ యువత పబ్బుల్లోని శబ్ద కాలుష్యం, మద్యం మత్తులో చిత్తవుతున్న ఆరోగ్యాలు, మాదక ద్రవ్యాలతో జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, అనైతిక సంబంధాలు గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నది. వీటికి విరుగుడుగా నేడు భజన క్లబ్బింగ్‌లు యువతకు మానసిక ప్రశాంతత, ఒత్తిడి నివారణ, ఆత్మీయుల కలయిక, ఆరోగ్యం కుదుట పడడం లాంటి ప్రయోజనాలను పొందడానికి మొగ్గుచూపడం శుభ పరిణామం. భక్తికి కార్పొరేట్ గ్లామర్ జోడించి మరో వినూత్న ప్రక్రియకు జీవం పోయడం అభినందనీయం. గుడులు, ఇండ్లలో జరిగే ఆధ్యాత్మిక భజనలు నేడు క్లబ్బుల్లో సామూహికంగా జరగడం సంతోషదాయకం. తొలుత 100 వరకు హాజరైయ్యే స్థాయి నుంచి నేడు భజన క్లబ్బింగ్‌లో 3 వేల వరకు యువత పాల్గొంటున్నారు.

భజన క్లబ్బింగ్ అంటే ఏమిటి !
వీకెండ్‌లో మహానగర యువత మత్తులో ఊగిపోతోంది. సాధారణంగా వీకెండ్ పబ్, క్లబ్ పార్టీ లేదా నైట్ లైఫ్ అనే పేరు వినగానే మన కళ్ళ ముందు దద్దరిల్లే సౌండ్ సిస్టమ్స్, మిరుమిట్లుగొలిపే లేజర్ లైట్లు, చేతిలో వైన్ గ్లాసులు, సిగరెట్ పొగలు, ఆడమగలు కలిసి చిందులు, మాదకద్రవ్యాల మత్తులు కనిపిస్తాయి. నేటి జెన్-జీ తరం యువత ఆలోచనలు మారుతున్నాయి. ఇలాంటి మూస పద్ధతులతో ఆరోగ్యాలు పాడైపోవడంతో సరికొత్త విప్లవానికి తెర లేస్తున్నది. అదే నేటి యువత ఇష్టపడుతున్న వినూత్న "భజన క్లబ్బింగ్" కల్చర్. నిన్నటి పబ్ కల్చర్ డిజే సౌండ్స్‌కి భక్తిని జోడించి మైమరచిపోయే ఆధ్యాత్మిక తన్మయత్వ కొత్త ట్రెండ్ మొదలు కావడం హర్షదాయకం. భజన క్లబ్బింగుల్లో మందు కిక్ లేనప్పటికీ 'సోబర్ హై' అనే ఆధ్యాత్మిక కిక్ యువతను ఆకర్షిస్తున్నది. మత్తు పదార్థాలు లేకుండా ఆనందాన్ని పొంగడానికి ఇవి దోహదపడుతున్నాయి. వీకెండ్ పార్టీల హంగోవర్లు వీటిలో ఉండవు. భజన క్లబ్బింగుల ద్వారా యువతలో నూతనోత్సాహం, సానుకూల ఎనర్జీ, ప్రశాంతత పెరుగుతున్నాయి. భజన క్లబ్బింగ్‌లకు వెళ్లే యువత సాంప్రదాయ దుస్తులు కూడా ధరించడం చూస్తున్నాం. పరిశ్రమ దిగ్గజాలు ఈ భజన క్లబ్బింగ్ కల్చర్‌ను ముద్దుగా "భారత్‌కోర్" అని పిలుస్తున్నారు. నేడు ఏకంగా ? 20,000 కోట్ల లైవ్ ఈవెంట్ల మార్కెట్లను ముంచేస్తున్నాయి. ఇదొక ఆహ్వానించదగిన సాంస్కృతిక సునామీ. నేడు సాజ్, ప్రఖర్ దంపతులు దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో యువతను భక్తి మత్తులో ముంచెత్తుతున్నారు.

ఆధ్యాత్మిక మత్తులో మహానగర యువత :
ఆధ్యాత్మికతతో ఆధునికతను జోడించి యువతను సన్మార్గంలో నడపడానికి భజన క్లబ్బింగ్‌లు ఉపయోగపడుతున్నట్లు తేల్చారు. సాంప్రదాయ భజన కార్యక్రమాలకు, ఆధునిక సంస్కృతిని జోడించి భక్తి పాటలు, కీర్తనలు, శ్లోకాలకు ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్, టెక్నో బీట్స్, లైవ్ బ్యాండ్స్, కచేరి స్టైల్‌లను మేళవించి భక్తిసాగరంలో మునిగి తేలుతున్నారు నేటి మహానగర యువత. భజన క్లబ్బింగ్‌లో లేజర్ లైట్లు, పొగలు కక్కుతున్న వేదికలు, భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి భక్తి పాటలకు నృత్యాలు చేయడం, గొంతు కలపడం జరుగుతోంది. భజన క్లబ్బింగ్‌ల్లో హనుమాన్ చాలీసా, కృష్ణ భజనలు, అచ్యుత్‌ల కేశవం, హరే కృష్ణ హరే రామ వంటి భక్తి గీతాలకు జెన్-జీ, మిలినియల్స్ (1981 - 1996 మధ్యయ జన్మించిన తరం) కాళ్లు కదుపుతూ ఊగిపోతున్నాయి. ఇక్కడ నృత్యాలతో పాటు ధ్యానం, శ్వాస వ్యాయామం, యోగా, గీతాలాపనలు సాధారణంగా జరుగుతుంటాయి. భక్తి క్లబ్బింగ్‌ల్లో మద్యం, మాదకద్రవ్యాలు, ధూమపానాలకు బదులుగా హెర్బల్ టీ, పండ్ల రసాలు సర్వ్ చేయబడతాయి. శాఖాహారా మాత్రమే అందుబాటులో ఉంటుంది. సోషల్ మీడియాల్లో మునక కన్న భజన క్లబ్బింగుల మత్తులో యువతను ఉర్రూతలూగిస్తున్నది. జై శ్రీరామ్, జై సీతారామ్, శ్రీకృష్ణ గోవింద హరే మురారి అంటూ భజన గీతాలకు పరవశించిపోతున్నారు. రిథమిక్‌గా ఒక ఆధ్యాత్మిక లోకంలో సేదదీరుతున్నారు. భక్తి పాటలకు కదం కలుపుతూ సరికొత్త లోకాల్లో విహరిస్తున్నారు. ఇదొక స్వల్పకాలిక తీర్థయాత్ర వలె కనిపిస్తున్నది. కొత్తతరం ఆధ్యాత్మిక రుచులకు లొంగి పోతున్నారు. అందరూ కలిసి సాధన చేస్తూ వినూత్న శక్తిని పొందుతున్నారు. కులమతాలు అతీతంగా జరుగుతున్న భజన క్లబ్బింగులతో రానున్న తరం తమ అమూల్యమైన మూలాలను తెలుసుకుంటూ పరమానందం పొందుతున్నారు.
ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు, కోల్‌కతా, హైదరాబాదు లాంటి మహానగరాల్లో పెరుగుతున్న భజన క్లబ్బింగులు ఇతర నగరాలకు కూడా విస్తరించాలి. దుర్వార్తలకు బానిసలు అవుతున్న యువతకు ఇదో ఆధ్యాత్మిక ఔషధ వరం కావాలి. నేడు భజన క్లబ్బింగులకు గిరాకీ పెరుగుతోంది. ఈ ఈవెంట్లా హౌజ్ ఫుల్ అవుతున్నాయి. ఈ ట్రెండ్ అమెరికా లాంటి దేశాలకు కూడా విస్తరిస్తోంది. ఇది కేవలం మతపరమైన అంశంగా కాకుండా హిందూ యువ సమాజంలో జీవనశైలిగా మారింది. సాంకేతికత పెరిగినా మన మూలాల విలువలను గ్రహించిన యువత భజనల వైపుకు మళ్లడం ఆహ్వానించదగిన పరిణామం. ఇదొక ఆధ్యాత్మిక ఓలలాట, భక్తి భావనల 'దమ్ మారే దమ్'. వేదమంత్రాల వైబ్రేషన్స్, ఆధ్యాత్మిక తాదాత్మ్యం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# డీసీసీ కార్యాలయంలో జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం

**మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరు**







**కరీంనగర్**కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ గారి అధ్యక్షతన నేడు కరీంనగర్ అర్బన్ డీసీసీ కార్యాలయంలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ (PAC) సమావేశం జరిగింది ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, డీసీసీ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం గారు, మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారు, సుడా చైర్మన్ శ్రీ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గారు, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణ గౌడ్, హుజురాబాద్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రెహమత్ హుస్సేన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, ఎండి తాజుద్దీన్, పులి ఆంజనేయులు గౌడ్, బోనాల శ్రీనివాస్, మడుపు మోహన్ తదితర జిల్లా ముఖ్య నేతలు హాజరయ్యారు.

సమావేశంలో చర్చించిన ప్రధాన అంశాలు:

1. వరి ధాన్యం కొనుగోలు:
మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ.. నియోజకవర్గాల వారీగా వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. ఐకేపీ సెంటర్ల వద్ద తాలు, తప్ప పేరుతో తరుగు లేకుండా కొనుగోలు జరిగేలా కాంగ్రెస్ శ్రేణులు పర్యవేక్షించాలని, రైస్ మిల్లర్లు, దళారుల మోసాలను అరికట్టాలని ఆదేశించారు. జీపీఎస్ విధానం వల్ల లారీల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

2. ఎస్ఐఆర్ - ఓటరు జాబితా సవరణ:
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కో-ఆర్డినేటర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎస్ఐఆర్ పేరుతో సెక్యులర్ ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలు తమ ఓటు విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

3. బీఎల్ఏ-2 నియామకం:
పీసీసీ ఆదేశాల మేరకు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో బీఎల్ఏ-2 (బూత్ లెవెల్ ఏజెంట్)ల నియామకం వెంటనే పూర్తి చేయాలని, నియమించిన బీఎల్ఏల పేర్లను డీసీసీ ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని ఆదేశించారు. బీఎల్ఏల ద్వారా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు సహాయం చేయాలన్నారు.

4. వేసవిలో తాగునీటి సమస్య:
వేసవి కాలంలో అధిక ఎండల ప్రభావంతో కరీంనగర్ కార్పొరేషన్ వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం, పార్టీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించామన్నారు. కార్పొరేటర్లు, సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, ఆసుపత్రుల వద్ద ప్రజలు, మూగజీవుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ గారు మాట్లాడుతూ..డివిజన్, మండల అధ్యక్ష పదవులకు మూడేళ్ల పార్టీ అనుభవం తప్పనిసరి చేసినట్టే, నామినేటెడ్ పదవుల నియామకంలో కూడా మొదటి నుంచి క్రియాశీలంగా పనిచేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. పార్టీ నిర్ణయించిన విధంగా కనీసం మూడేళ్లుగా పార్టీలో కొనసాగుతున్న వారికి అవకాశం కల్పించాలని, కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న కార్యకర్తలకు న్యాయం జరిగేలా అధిష్ఠానం ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు.

పీఆర్వో
బి అర్బన్ డీసీసీ, కరీంనగర్

# ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ శ్రీరంగరాజుపల్లికి రోడ్డు నిర్మిస్తున్నా

- త్వరలో 18 కోట్లతో పరిగిలో రహదారులకు భూమిపూజ
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత





**అనంతపురం :** శ్రీరంగరాజుపల్లికి రోడ్డు నిర్మించిన తరవాతే గ్రామంలోకి వస్తానని గడిచిన ఎన్నికల్లో హామీ ఇచ్చానని, ఇచ్చిన మాటను ఇప్పుడు నిలబెట్టుకున్నానని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మండలంలోని రూ.3.50 కోట్లతో పరిగి – శ్రీరంగరాజుపల్లి రోడ్డు నిర్మాణానికి సోమవారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూముందుంటుందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీవెనలతో నియోజక వర్గ వ్యాప్తంగా విస్తృతంగా రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. పరిగి – శ్రీరంగరాజుపల్లి రహదారితో పాటు
పరిగి నుంచి సిరికోళం కు 3 కోట్లు సోమందేపల్లి రోడ్డు నుంచి ఊటుకూరుకు 3 కోట్ల 80 లక్షలు,,రూ.3.20 కోట్లతో ఆనందపురం – సంగమేశ్వరకు రోడ్డు, మదిగిర – మోద 56 మదిగిరి నుండి చెర్లోపల్లి కు 82 లక్షలు, , పరిగి – హిందూపురం వయా స్టేట్ బోర్డర్ వరకూ రోడ్డు 4కోట్ల 11 లక్షలు ,ఊటుకూరు నుండి టీడీ పల్లికు 2 కోట్ల 10 లక్షలు,శ్రీరంగరాజుపల్లి – చెర్లోపల్లికి రోడ్డులు నిర్మించబో తున్నామన్నారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లను కూడా మం జూరు చేశామన్నారు. బీసీ హాస్టల్ కు శాశ్వత భవన సదు పాయానికి నిర్మాణాలు చేపట్టామన్నారు. విలేజ్ క్లినిక్, తాగునీటి కల్పనకు జలజీవన్ మిషన్ కింద వాటర్ హెడ్ ట్యాంకు లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ఒకవైపు రహదారులు నిర్మిస్తూనే పరిశ్రమలు ఏర్పాటుచ చేస్తున్నామన్నారు. మరో వైపు పెన్షన్లు, మహిళలకు ఫ్రీ బస్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామన్నారు. ఇటీవల పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ ఫ్యాక్టరీని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారన్నారు. ఈ పరిశ్రమ రాకతో వేలాది మందికి ఉద్యోగాలు రానున్నాయని మంత్రి సవిత తెలిపారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ, గత ఎన్నికల సమయంలో శ్రీరంగాజుపల్లికి ప్రచారానికి వచ్చిన సమయంలో గ్రామానికి చెందిన వృద్ధురాలు తమ గ్రామానికి రహదారి నిర్మించాలని కోరారన్నారు. గ్రామానికి వచ్చే రహదారి లేకపోవడంతో, గర్భిణులు, విద్యార్థులు, రైతులు తమ గ్రామం నుంచి సమీప పట్టణాలకు వెళ్లలేకపోతున్నామని ఆమె తెలిపారన్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో, తమ ఊరు మగ బిడ్డలకు ఇతర ప్రాంతాలకు చెందిన ఆడ బిడ్డలను ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదని ఆ వృద్ధురాలు ఆవేదన వ్యక్తంచేశారు. ఆనాడే శ్రీరంగరాజుపల్లికి రోడ్డు నిర్మిస్తానని వృద్ధురాలికి మాటిచ్చానని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రూ.3.50 కోట్లతో పరిగి – శ్రీరంగరాజుపల్లికి రోడ్డు నిర్మిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్ లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి


– ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వాత్సల్ టోప్పో



**ఏటూరునాగారం,మే 18 :** సోమవారంఐ ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరీతగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించినారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు 45 దరఖాస్తులు ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ ఏటూరునాగారం కి స్వయంగా గిరిజనులు సమర్పించారు.
ఈ కార్యక్రమంలో కె నాగోరావు అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి(జి) ఐటిడిఏ, డి జనార్దన్ డిప్యూటి డైరెక్టర్ ఐటిడిఏ, వీరబద్రం ఈఈ టి డబ్ల్యూ ఐటిడిఏ, ఎ రాజ్ కుమార్ పరిపాలన అధికారి ఐటిడిఏ, ఏ అనిల్ కుమార్ డిప్యూటి తహసిల్దార్ (ఎస్డీసి) ఐటిడిఏ, కె క్రాంతి కుమార్ డిప్యూటీ డిఎంహెచ్వో ఐటిడిఏ, కె ప్రభాకర్ పేసా కో ఆర్డినేటర్ ఐటిడిఏ, ఏ కిషోర్ జియాలజిస్ట్ ఐటిడిఏ, ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆర్ఐటిఐ, ఏమ్ కొండల రావు జెడిఎమ్ ఐటిడిఏ, ఎల్ శంకర్ టిఎస్ ఆర్టీసి మేనేజర్ మరియు సంబందిత అధికారులు గ్రీవెన్స్ సెల్ లో పాల్గొన్నారు.

# వారం రోజులు నిప్పుల కుంపటే ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:00 గంటల్లోపు బయటకు వెళ్లొద్దన్న వాతావరణ శాఖ

- తెలంగాణలో వచ్చే వచ్చే వారం రోజుల పాటు ఎండలు తారెత్తించనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది




**ములుగు జిల్లా (ప్రతినిధి) :** ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. తీవ్ర వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. సగటున 45 -48 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు వెల్లడించింది.రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వివరించింది. మధ్యాహ్నం సమయంలో భీకరమైన ఎండలు ఉంటాయని.. అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని సూచించింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటికి వెళ్లొద్దని పేర్కొంటున్నారు.ఇక ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల ప్రతాపం మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. రవీందర్ నాయక్ హెల్త్ అడ్వైజరీ జారీ చేశారు. దాహం వేయకపోయినా నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం వంటివి తాగాలని సూచిస్తున్నారు. బయటికి వెళ్లినపుడు తప్పకుండా తాగునీటిని వెంట ఉంచుకోవాలని తెలిపారు.

# యువత సన్మార్గంలో పయణించాలి

- సంజోష్‌ను అభినందించిన ఏఎస్పీ మనన్ బట్
- 118మంది విద్యార్థులు క్యాష్ అవార్డు పంపిణీ







**ఏటూరునాగారం,మే 18 :** యువత సన్మార్గంలో ప్రయణించాలని ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ బట్ అన్నారు. సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం, కన్నాయి గూడెం మండలాల్లోని పదో తరగతిలో 500ల మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు, ఇంటర్మీడియేట్ లో 900ల పై మార్కుల వచ్చిన విద్యార్థులకు రూ 2వేల చొప్పున క్యాష్ ఆవార్డులను సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు ఏఎస్పీ చేతుల మీదుగా బేవర్స్ సినిమా హీరో, సంజోష్ ఫౌండేషన్ అధ్యక్షుడు సంజోష్ లు కలిసి నగదును అందజేశారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఏఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్య, నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. మగ పిల్లలు ఆడ పిల్లల వెనుక పడొద్దని, వారి జీవితాలను ఆగం చేసుకోవద్దన్నారు. యువత క్షణిక ఆనందం కోసం నిండు జీవితాలను బలి చేసుకుంటున్నారన్నారు. మైనర్ బాలికల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఎవరు కూడా నిర్లక్ష్యంగా ఆడపిల్లలను పెంచొద్దని కోరారు. అనంతరం హైకోర్టు ల్యాయర్ పూజారి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నేటి సమాజంలో క్షణక అవేశంలో తీసుకునే నిర్ణయాలతో జీవితాలు ఆగం అవుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి సపోర్ట్ కావాలి అన్నా కూడా ఈ సంజోష్ ఫౌండేషన్ ద్వారా చేపడుతామన్నారు. విద్యార్థుల అభివద్ధి పౌండేషన్ లక్ష్యం-- హీరో సంజోష్ 18ఎంయూఎల్052-- సంజోష్.
ములుగు జిల్లా ఏటూరునాగారం శంకరాజుపల్లి గ్రామంలో పుట్టిన నేను విద్యార్థులను పూర్తి స్థాయిలో అభివద్ధి చేయడానికే సంజోష్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు బేవర్స్ సినిమా హీరో సంజోష్ తెలిపారు. మా పౌండేషన్ ద్వారా గతంలో కంటి ఆపరేషన్లు చేపట్టామన్నారు. ఇప్పుడు సుమారు 118 మంది విద్యార్థులకు రూ 2వేల చొప్పున అందజేశామన్నారు. మునుముందు మరింత ప్రోత్సకాలు, ఇతర సహకారాలను అందించడానికి ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తోందన్నారు. నేను పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. విద్యార్థుల అభివద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. అనంతరం నత్యప్రదర్శన చేసిన అలువాల సుమనశ్రీ ని సినిమా హీరో సంజోష్ సన్మానించారు. అదేవిధంగా కరాటేలో జాతీయ స్థాయికి చేరిన వసంత విశాల్ ను సంజోష్ సన్మానించారు.


**సంజోష్‌ను ఆదర్శంగా తీసుకోవాలి**

**సినిమా హీరో సంపూర్ణేష్‌బాబు**

పేద విద్యార్థులకు నగదు పురస్కారం ఇవ్వాలని ఆలోచన వచ్చిన సంజోష్‌ను మనందరం ఆదర్శంగా తీసుకోవాలని సినిమా హీరో సంపూర్ణేష్‌బాబు అన్నారు. నగదు పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని పయణించాలని, గుడ్డిగా ముందుకు వెళితే లక్ష్యం చేరడం కష్టం అన్నారు. కష్టాన్ని ఎప్పుడు ఎదురుకునే విధంగా సిద్దంగా ఉండాలన్నారు. చిన్న చిన్న కష్టాలు, అవమానాలకు కుంగిపోవొద్దని విద్యార్థులను కోరారు. అదేవిధంగా వచ్చిన అథితులను పౌండేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమం లో డీఈఓ సిద్దార్థరెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎంఈఓ మల్లయ్య, భవిత జిల్లా కోఆర్డినేటర్ సాంబయ్య, ఏఎంఓ శ్యామ్ సుందర్‌రెడ్డి, ఎంఈఓ మల్లయ్య, జెడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ సాంబశివరావు, కన్నాయిగూడెం ఎంఈఓ రాజేష్, కోడి వెంకట్, పెండ్యాల ప్రభాకర్, రామా ల యం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపులో సమస్యల పరిష్కారానికి కృషి ఎస్సై అచ్చా కమలాకర్

– తాడ్వాయి మండలం ఎలుబాక గ్రామం



**ములుగు జిల్లా (ప్రతినిధి) :** పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నార్లాపూర్ ( మేడారం) ఎస్సై అచ్చ కమలాకర్ సం దర్శించారు. ఈ కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్సై అడిగి తెలు సుకున్నారు. కొద్ది రోజులుగా లారీలు రావడం లేదని, ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు ఎస్సైకి సమస్యలను విన్నవించారు.
వెంటనే స్పందించిన ఎస్ఐ కమలాకర్

# కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంకీ గన్స్ అందజేత




**టేకులపల్లి ,మే 18 :** సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో టేకులపల్లి మండ లంలోని నైన్త్ మైల్ తండా, సాయన్న పేట గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం హైదరా బాద్, సకశేరుకాలు చీడపీడల యజమాన్యం విభాగం వారి సహ కారంతో పంట పొలాల్లో అడవి పందుల బెడద,కోతుల బెడద నుంచి పంటను రక్షించుకోవడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.సునీత దేవి,సీనియర్ శాస్త్రవేత్త రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన ఉపప్రణాళిక పథకంలో భాగంగా ఎంపిక చేసిన 20మంది రైతులకు కోతుల బెడద నుంచి కాపాడటానికి మంకీ గన్స్ ఇస్తున్నామని,వీటిని రైతులు సక్రమంగా వాడుకొని కూరగాయపంటలను,వరి పొలాలను మొక్కజొన్న పంటలను కోతులు,అడవి పందుల బెడద నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. వీటిని సక్రమంగా వినియోగించుకుంటే రానున్న రోజుల్లో పెద్ద మొత్తంలో రైతులకు వీటిని అందించడానికి ముందుకు వస్తామని సూచించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కృషిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.టి.భారత్ మాట్లాడుతూ రైతులు గత కొన్ని సంవత్సరాలుగా పంటలను పండించే క్రమంలో కోతుల వలన అదే విధంగా అడవి పందుల బెడద వలన చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి తీసుకురావడం ద్వారా ఈ రోజున మంకీ గన్స్, అడవి పందుల వలలు పంపిణి కొరకు నైన్త్ మైల్ తండా,సాయన్నపేట గ్రామాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని తెలియపరిచారు.అదేవిధంగా రైతులు పంటలలో దిగుబడిని ఎక్కువ పొందాలని ఆశతో మోతాదుకు మించి ఎరువులను వాడుకుంటున్నారని తద్వారా భూసారం తగ్గిపోతుంది అని కూడా రైతులకు తెలియపరచడం జరిగినది.డా. శ్రీనివాస్ రెడ్డి,శాస్త్రవేత్త,చీడపీడల విభాగం మాట్లాడుతూ మంకీ గన్స్ ను ఎలా ఉపయోగించుకోవాలో డెమో ద్వారా రైతులకు సూచించారు.అదేవిధంగా ఈ గ్రామాల్లోని ఇద్దరు చొప్పున రైతులకు అడవి పందులు బెడద నుంచి పంటలను రక్షించుకోవడానికి వలన కూడా అందివ్వడం జరిగింది దానిని కూడా ఎలా ఉపయోగించుకోవాలి సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ మాట్లాడుతూ మంకీ గన్స్ ముఖ్యంగా కూరగాయ పంటలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలియపరచి రానున్న రోజుల్లో వీటి యొక్క ఉపయోగాన్ని మరింతగా విస్తృత పరుస్తామని రైతులకు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో మండల ఏవో అన్నపూర్ణ మాట్లాడుతూ రైతులు కెవికె భద్రాద్రి కొత్తగూడెం వారు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకొని పంటలు నష్టాల బారిన పడకుండా రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 60 మంది అభ్యుదయ మహిళ రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



**షాద్ నగర్ మే18:** అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశం రంగారెడ్డి: సోమవారం అదనపు కలెక్టర్(రెవెన్యూ) చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డి.ఎం., డీసీఎస్ఓ, డీఆర్డీఓ, డీఎంఓ, డీఎల్ఎంఓ, డీసీఓ ,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.జిల్లాలో 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తూ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాము. ఇప్పటి వరకు 37 పీపీసీ కేంద్రాలను ప్రారంభించడం జరిగింది. వీటి ద్వారా 7,187 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది. ఇందుకు గాను రైతుల ఖాతాల్లో రూ.6 కోట్లు జమ చేయడం జరిగింది.సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి, ఫీల్డ్ స్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.రైస్ మిల్లర్లు తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని, ఎలాంటి నాణ్యత కోతలు (తరుగు) విధించకుండా
ధాన్యాన్ని స్వీకరించాలని సూచించారు. అలాగే మిల్లుల వద్ద ఏ వాహనం కూడా ఒక రోజు కంటే ఎక్కువ కాలం నిల్వ ఉండకూడదని హెచ్చరించారు.

# పజావాణికి 212ఫిరాదులు






**షాద్ నగర్ మే18:** సోమవార సమీకత జిలా కారాలయాల సముదాయ సమావేశ మదిరలో నిరహిచిన పజావాణి కారకమానికి (92) ఫిరాదులు అదాయి. జిలాలోని వివిధ పాతాల నుడి వచిన ఫిరాదు దారులు తమ సమసలను జిలా కలెకర్ సి.నారాయణ రెడికి వినవిసూ అరీలు సమరిచారు.
ఈ సదరగా కలెకర్ మాటాడుతూ పజా సమసల సతర పరిషార కోస నిరహిసున పజావాణి కారకమలో పజలు అదిచే వినతులను సబధిత శాఖల జిలా అధికారులు తక్షణమే పరిషరిచాలని ఆదేశిచారు. అరీలను పెడిగ్ లో పెటకుడా ఎపటికపుడు పరిశీలన జరుపుతూ పరిషరిచాలని అధికారులను ఆదేశిచారు.రెవెనూ శాఖ--32, ఇతర శాఖలు 60 , మొత 92 దరఖసులు అదాయి.అనతర జిలా కలెకర్ సి.నారాయణ రెడి మాటాడుతూ జనాభా గణన-2027 కారకమలో భాగగా ఎనుమరేటరు ఇడ గణన పకియను నిబధనలకు అనుగుణగా సమరవతగా నిరహిచాలని, ఎనుమరేటరు తమకు కేటాయిచిన ఇడ జాబితా బాక్ లలో ఇటిటికి వెళి పభుత జారీ చేసిన మారదరకాలు వివరాలు ఖచితగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గహ జాబితా పకియలో ఎలాటి పొరపాటు లేకుడా జాగత వహిచాలని, పతి కుటుబానికి సబధిచిన వివరాలను పూరిసాయిలో నమోదు చేయాలని తెలిపారు. సరే పకియను వేగవతగా, పారదరకగా నిరహిచేదుకు అధికారులు నిరతర పరవేక్షిచాలని సూచిచారు. పతి ఇటిని కవర్ చేయాలని, ఎనుమరేటరు తమకు కేటాయిచిన ఇడ జాబితా బాక్ లలో ఏ ఒక కుటుబ మిగలకుడా అని కుటుబాల వివరాలు నమోదు చేయాలని ఆదేశిచారు. సరేలో సేకరిచే సమాచార ఖచితగా నమోదు చేయాలని, డిజిటల్ ఎటీలను సకాలలో పూరి చేయాలని సూచిచారు. ఫీల్ సాయిలో పని చేసున సిబది పజలకు జనగణన పాధానతను వివరిచి పజల సహకార పొదాలని తెలిపారు. ఇటిటి సరే పకియను అధికారులు నిరేశిత గడువులోపు చేయాలని ఆదేశిచారు.
ఈ కారకమలో జిలా అదనపు కలెకర్ చదారెడి ( రెవెనూ), కిరణయి (లోకల్ బాడీస్) జిలా రెవెనూ అధికారి శారద, వివిధ శాఖల జిలా అధికారులు, కలెకరేట్ సూపరిటెడెటు, సబధిత అధికారులు తదితరులు పాలొనారు.జిలా పౌర సబధాల అధికారి రగారెడి జిలా.

# గండిపేట తాసిల్దార్ ను కలిసిన బండ్లగూడ జాగిర్ కాంగ్రెస్ నాయకులు




**రంగారెడ్డి జిల్లా (ప్రతినిధి) గండిపేట్** బండ్లగూడ జాగీర్ బైరాయిగూడ లోని విద్యానగర్లో రోడ్డు వేయడానికి ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్తో సమస్య ఉన్నందున స్థానిక గండిపేట్ తాసిల్దార్ని కలసిన బండ్లగూడ జాగిర్ కాంగ్రెస్ నాయకులు అక్కడున్న పరిస్థితులు వివరించగా సానుకూలంగా స్పందించి గండిపేట్ తాసిల్దార్,రోడ్డు వేసుకోమని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నార్సింగ్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ దప్పు నవీన్ కుమార్ శ్రీనివాస్ డైరెక్టర్ బాలరాజ్ అంకం శ్రీనివాస్ విద్యానగర్ ఫేస్ టు కాలనీ సభ్యులు పాల్గొనడం జరిగింది

# ధోని ఫ్యాన్స్‌కు మరోసారి నిరాశ



ఐపీఎల్ 2026లో భాగంగా నేడు మరో హై వోల్టేట్ మ్యాచ్ జరుగుతోంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సీఎస్కే తలపడుతోంది. ఇక టాస్ గెలిచిన చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే సీఎస్కే అభిమానులకు ఈసారి కూడా నిరాశే మిగిలింది. ఎంఎస్ ధోనీ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని కెప్టెన్ రుతురాజ్ స్పష్టం చేశాడు. ధోనీ పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడం వల్లే ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని రుతురాజ్ తెలిపాడు. ఈ రోజు తాము గెలుస్తామని, తదుపరి మ్యాచ్‌కు ధోనీ కోలుకుని తిరిగి జట్టులోకి వస్తాడని ఆశిస్తున్నట్లు కెప్టెన్ పేర్కొన్నాడు.ఈ క్రమంలో ధోనీ టీ20 రిటైర్మెంట్‌కు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. అయితే చెన్నై చేపాక్ వేదికగా జరగనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగి సొంత అభిమానుల ముందు ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ధోనీ మాట్లాడిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. అందులో ధోనీ 'చెన్నైలోనే నా ఆఖరి టీ20 మ్యాచ్ ఉంటుంది' అని అన్నాడు. దీంతో అది నిజం కానుందని అంటున్నారు. 'పక్కా ప్లానింగ్‌తోనే నా క్రికెట్ కెరీర్‌ను ఉంటుంది. ఇంటర్నేషనల్ లెవెల్‌లో నా చివరి మ్యాచ్ రాంచీలో ఆడాను. అలాగే ఆఖరి టీ20 మ్యాచ్‌ను చెన్నైలోనే ఆడతాను కావొచ్చు. అది ఇప్పుడేనా లేదా ఐదేళ్ల తర్వాతనా అనేది చెప్పలేను!'అని ధోనీ 2021లో సీఎస్కే ఫ్రాంచైజీ నిర్వహించిన ఈవెంట్‌లో అన్నాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతుంది.ఇదిలా ఉండగా, ధోనీకి సంబంధించిన ఒక కొత్త వీడియో సైతం నెట్టింట వైరల్‌గా మారింది. అందులో ధోనీ ఎన్ఎస్‌జీ కమాండర్స్‌తో మాట్లాడుతున్నట్లు కనిపిస్తుంది. ఫుడ్ ప్లేట్ చేతిలో పట్టుకొని ఉన్న ధోనీ అందులో 'నేను ఫిట్‌గా కనిపిస్తున్నానా' అని ఎన్ఎస్‌జీ కమాండర్‌ను నవ్వుతూ అడుగుతాడు. దీంతో తాను ఫిట్‌గానే ఉన్నానని ఇలా ఫ్యాన్స్‌కు చెప్పాడని, రిటైర్మెంట్‌లాంటివి ఏమీ లేవని హింట్ ఇచ్చాడంటూ ఫ్యాన్స్ వాదిస్తున్నారు. అయితే సన్‌రైజర్స్‌తో సోమవారం చెన్నై వేదికగానే మ్యాచ్ ఉంది. ఈ సీజన్‌లో సీఎస్కేకు ఇదే హోం గ్రౌండ్‌లో లాస్ట్ మ్యాచ్. దీంతో ధోనీ గతంలో చెప్పిన రిటైర్మెంట్ టైమ్ ఇప్పుడే వచ్చేసిందా అంటే నెటిజన్లు ఔను అనే అంటున్నారు. ప్రస్తుతం 44ఏళ్లు ఉన్న ధోనీ వచ్చే సీజన్‌దాకా ఫిట్‌నెస్ కాపాడుకోగలడా అనేది కచ్చితంగా చెప్పలేం. ఇక ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి కూడా సడెన్‌గా వీడ్కోలు చెప్పి అందర్నీ షాక్‌కు గురి చేసిన తలా ఇప్పుడు ఐపీఎల్ నుంచి కూడా తప్పుకొని మరోసారి అభిమానులకు షాక్ ఇస్తాడా అనేది వేచి చూడాలి!

# కోల్‌కతా మేనేజ్‌మెంట్‌పై బీసీసీఐ సీరియస్!



ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ కీలక ఘట్టానికి చేరుకుంటున్న వేళ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఒక సరికొత్త వివాదం చుట్టుముట్టింది. శనివారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి గాయంతో తీవ్రంగా ఇబ్బంది పడినప్పటికీ, అతనితో బలవంతంగా మ్యాచ్‌ను కొనసాగించడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫ్రాంచైజీల గెలుపోటముల కంటే దేశీయ ఆటగాళ్ల ఫిట్‌నెస్, భద్రత ముఖ్యమని భావించే భారత క్రికెట్ నియంత్రణ మండలి, ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్న సమయంలో వరుణ్ చక్రవర్తి పాదానికి గాయమైంది. సాధారణంగా ఆటగాడికి గాయమైతే వెంటనే మైదానం వెలుపలికి పంపి ఫిజియో పర్యవేక్షణలో ఉంచాలి. కానీ కేకేఆర్ కెప్టెన్ మరియు మేనేజ్‌మెంట్ మాత్రం వరుణ్ చక్రవర్తితో అతని నాలుగు ఓవర్ల పూర్తి కోటాను వేయించింది. బంతిని విసిరిన ప్రతిసారీ, రనప్ సమయంలోనూ వరుణ్ తీవ్రమైన నొప్పితో నడవలేక ఇబ్బంది పడటం లైవ్ టెలికాస్ట్ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. సోషల్ మీడియాలో ఈ వీడియో క్లిప్స్ వైరల్‌గా మారడంతో, కేకేఆర్ జట్టు మేనేజ్‌మెంట్ కేవలం మ్యాచ్ గెలవడం కోసమే ఆటగాడి కెరీర్‌ను రిస్క్‌లో పడేసిందంటూ నెటిజన్లు, మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉన్నతాధికారులు మరియు నేషనల్ క్రికెట్ అకాడమీ వైద్య బృందం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. వరుణ్ చక్రవర్తి బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టు ( లో ఉన్న ఆటగాడు. బోర్డు నిబంధనల ప్రకారం.. కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లకు ఐపీఎల్ సమయంలో ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేదా గాయాలు తలెత్తినా ఫ్రాంచైజీలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. గాయం తీవ్రతను దాచిపెట్టి లేదా నొప్పిని భరిస్తూ ఆటగాళ్లను మైదానంలోకి దించడం నిబంధనలకు విరుద్ధం. రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని, ఆటగాళ్ల 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'ను పర్యవేక్షించే బాధ్యత ఎన్‌సీఏ పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంచైజీ వరుణ్ చక్రవర్తి శారీరక ఫిట్‌నెస్‌ను నిర్లక్ష్యం చేయడంపై బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు అంతర్గత సమాచారం.బీసీసీఐ జోక్యం చేసుకోవడం మరియు బోర్డు నుండి గట్టి హెచ్చరికలు రావడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ మేనేజ్‌మెంట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వరుణ్ చక్రవర్తి పాదానికి తగిలిన గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు, అతనికి రాబోయే కొన్ని మ్యాచ్‌ల పాటు పూర్తి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో కేకేఆర్ ఆడబోయే తదుపరి కీలకమైన మ్యాచ్‌కు వరుణ్ చక్రవర్తి ప్లేయింగ్ ఎలెవన్ (తుది జట్టు) కు దూరం కావడం దాదాపు ఖాయమైంది.

# రవీంద్ర జడేజా ఆడకపోవడంపై విమర్శలు



ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఆడకపోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలు, అనుమానాలకు తావిచ్చింది. హాట్ డిబేట్ కు తెర తీసింది. ప్లేఆఫ్స్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్ కు డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. మేనేజ్మెంట్ వ్యూహాత్మకంగా అతన్ని తప్పించిందా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. రవీంద్ర జడేజా ఆడకపోవడం పట్ల ఇంగ్లాండ్ మాజీ కేప్టెన్ మైఖెల్ వాన్ ఈ అనుమానాలు లేవనెత్తారు. అతను ఎందుకు దూరమయ్యాడని ప్రశ్నించారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా రవీంద్ర జడేజా విశ్రాంతి తీసుకుంటున్నాడని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చెప్పినప్పటికీ, దీనికి వేరే కారణం ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ అనేది సమస్యే కాదని తేల్చి చెప్పారు.రవీంద్ర జడేజాకు ఏం జరిగిందో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. చిన్నపాటి సమస్యకు అతను మ్యాచ్ నుంచి తప్పుకోడు. విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా పనిభార నిర్వహణ పేరు చెప్పడం వింత. అతనికి ఏదో సమస్య ఉందనేది స్పష్టం. అతను మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నా.." అని పేర్కొన్నారు. బ్యాటింగ్ పతనం కాకుండా జడేజా అడ్డుకునేవాడని, మిచెల్ స్టార్క్‌పై భారీ షాట్లతో ఎదురుదాడికి దిగేవాడని తేల్చి చెప్పారు. ఎడమచేతి స్పిన్ బౌలర్ కావడం వల్ల పరుగులను కూడా కట్టడి చేసేవాడని వివరించారు.రియాన్ పరాగ్ కెప్టెన్సీని కూడా మైఖేల్ వాన్ తప్పుబట్టారు. ఢిల్లీ ఛేజింగ్‌లో 18వ ఓవర్‌లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ డొనోవన్ ఫెరీరాను బౌలింగ్‌కు దించడాన్ని వాన్ విమర్శించారు. "డొనోవన్ ఫెరీరాను బౌలింగ్ చేయించిన వ్యూహాత్మక నిర్ణయాన్ని నేను ప్రశ్నించాల్సిందే. ఇద్దరు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని భావించి పార్ట్‌టైమ్ ఆఫ్-స్పిన్నర్‌ను ప్రవేశపెట్టారా అది

# మరో కొత్త టీం ఎంట్రీకి రంగం సిద్ధం..

పురుషుల ఐపీఎల్ టోర్నమెంట్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, అశేష అభిమాన గణాన్ని సంపాదించుకున్న చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పుడు మహిళల క్రికెట్ వైపు అడుగులు వేస్తోంది. తమిళనాడు గ్లోబల్ టూరిజం సదస్సులో సిఎస్‌కె ప్రధాన కార్యనిర్వాహక అధికారి కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. పురుషుల క్రికెట్ తర్వాత ఫ్రాంచైజీ విస్తరణలో భాగంగా తాము మహిళల క్రికెట్‌కే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలోనే డబ్ల్యూపీఎల్‌లో ఒక జట్టును సొంతం చేసుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం మహిళల లీగ్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ వంటి ప్రముఖ ఐపీఎల్ జట్లు ఇప్పటికే తమ మహిళా జట్లను విజయవంతంగా నడుపుతున్నాయి. వీటికి తోడు యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా లీగ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి.

ఇప్పుడు ఈ జాబితాలోకి చెన్నై సూపర్ కింగ్స్ కూడా చేరితే లీగ్ స్థాయి మరింత పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. చెన్నై జట్టుకు ఉన్న అపారమైన అభిమాన బలం (ఎల్లో ఆర్మీ) మహిళల లీగ్‌కు కూడా తోడైతే, మైదానాలు పసుపు రంగుతో కళకళలాడటం ఖాయం. మహిళల లీగ్‌లోకి ప్రవేశించడంపై కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. యాజమాన్యం ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోదని, అత్యంత సుస్థిరమైన, వ్యూహాత్మకమైన విధానంలోనే ముందుకు వెళ్తామని చెప్పారు. క్రీడారంగంలో దీర్ఘకాలిక ప్రణాళికలతో ఆటగాళ్లకు అండగా నిలబడటం చెన్నై సంస్కృతి. అదే పద్ధతిని మహిళల క్రికెట్‌లోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ ఆశలు సజీవం



ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఢిల్లీ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరింది. 5 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేసి 4 బాల్స్ మిగిలి ఉండగానే ఛేజ్ చేసి గెలిచింది. ఈ విజయంతో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు కొనసాగుతున్నాయి. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశి 21 బాల్స్‌లో 5 ఫోర్లు, 3 సిక్సులు కొట్టి 46 పరుగులు చేశాడు. కెప్టెన్ రియాన్ పరాగ్ 26 బాల్స్‌లో 3 ఫోర్లు, 5 సిక్సులతో 51 రన్స్ చేశాడు. ధ్రువ్ జురెల్ 40 బాల్స్‌లో 53 రన్స్ సాధించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ లోని మిచెల్ స్టార్క్ 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి, 4 వికెట్లు తీసి రాజస్థాన్ మ్యాచ్‌ను తిప్పికొట్టాడు. అతను 14.2వ ఓవర్‌లో పరాగ్, 14.3లో డోనవన్ ఫెరీరా, 14.5లో రవి సింగ్ వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్‌లాంటి ప్రదర్శన చేశాడు. లుంగి ఎన్‌గిడి 2 వికెట్లు, మధవ్ తివారి 2 వికెట్లు సాధించారు. రాజస్థాన్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో ధమాల్ అంది. ఢిల్లీ ఛేజ్‌లో అభిషేక్ పోరెల్ 31 బాల్స్‌లో 7 ఫోర్లు, 1 సిక్స్ కొట్టి 51 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ 42 బాల్స్‌లో 1 ఫోరు, 3 సిక్సులు కొట్టి 56 పరుగులతో అద్భుత ఆరంభం ఇచ్చారు. కెప్టెన్ అక్సర్ పటేల్ 19 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. ఇతరులు కీలక సహకారం అందించారు. జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీసినా ఢిల్లీ స్థిరంగా ఛేజ్ పూర్తి చేసింది. అశుతోష్ శర్మ చివరి ఓవర్లలో సిక్స్‌తో మ్యాచ్‌ని ముగించాడని ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫో తెలిపింది. అక్సర్ పటేల్ (ఢిల్లీ) టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అరుణ్ జైట్లీ స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది, కానీ స్టార్క్ లాంటి బౌలర్లు డెత్ ఓవర్లలో ప్రభావం చూపారు. వాతావరణం హాట్ ఢ డ్రైగా కనిపించింది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ 13 మ్యాచుల్లో 6 విన్నింగ్స్‌తో 12 పాయింట్లు సాధించి 7వ స్థానంలో ఉంది. రన్ రేట్ -0.871. రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో 6వ స్థానంలో ఉంది. ఈ జట్టు 12 మ్యాచ్‌లు ఆడి 6 గెలిచింది. రాజస్థాన్ బ్యాటింగ్ ఆరంభంలో బాగుంది కానీ మిడిల్ ఓవర్లలో.. స్టార్క్ స్టార్మ్ ఒకే ఓవర్‌లో 3 వికెట్లు తియ్యడం వల్ల చిక్కుల్లో పడింది. ఢిల్లీ బ్యాటింగ్ డెప్త్, ఫినిషింగ్ సామర్థ్యం గెలుపును తెచ్చిపెట్టాయి. రెండు జట్ల మధ్య పోటీ తీవ్రంగా కనిపించింది.


# ఐపీఎల్ 2008 సీజన్‌లో మెరుస్తున్న కుర్రాళ్లు

ఐపీఎల్ చరిత్రలో కొందరు ఆటగాళ్లు వన్ సీజన్ వండర్స్‌లా మిగిలిపోయారు. ఒక్క సీజన్ అద్భుత ప్రదర్శన చేసి, తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నా.. ఆ తర్వాత ఫామ్ కోల్పోయి అదృశ్యమయ్యారు. అలాంటి ఆటగాళ్లపై ఓ లుక్కేద్దాం.ఐపీఎల్ 2008 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ స్వప్నిల్ అస్నోద్కర్ అసాధారణ బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. దూకుడైన బ్యాటింగ్‌తో 9 మ్యాచ్‌ల్లో 311 పరుగులతో టాక్ ఆఫ్ ది నేషన్‌గా నిలిచాడు. సౌతాఫ్రికా ప్లేయర్ గ్రేమ్ స్మిత్‌తో కలిసి అదిరిపోయే ఆరంభాలు అందించి రాజస్థాన్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. కానీ, ఆ తర్వాత మూడు సీజన్లలో దారుణంగా విఫలమై కనుమరుగయ్యాడు.కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ప్లేయర్ పాల్ వాల్తాటీ కూడా ఒక్క సీజన్‌లోనే మెరిసాడు. 2011లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 63 బంతుల్లో 123 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో యశస్వి జైస్వాల్ ఆ రికార్డ్ బద్దలు కొట్టేవరకు ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసి అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా వాల్తాటీ కొనసాగాడు.ఈ సెంచరీ తర్వాత.. డెక్కన్ ఛార్జర్స్‌పై 75 పరుగులతో పాటు నాలుగు వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గా సత్తా చాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రదర్శనతో పంజాబ్ జట్టులోకి వచ్చిన వాల్తాటీ.. ఐపీఎల్ 2011 సీజన్‌లో 14 మ్యాచ్‌ల్లో 463 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2012 సీజన్‌లో మణికట్టు గాయంతో ఫామ్ కోల్పోయిన వాల్తాటీ ఆ తర్వాత కనురుగయ్యాడు. కేకేఆర్ ప్లేయర్ మన్విందర్ బిస్లా కూడా ఐపీఎల్ 2012 సీజన్‌లో దుమ్మురేపి ఆ తర్వాత పత్తా లేకుండా పోయాడు. ఐపీఎల్ 2012 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించి కేకేఆర్ టైటిల్ గెలవడంతో మన్విందర్ కీలక పాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో ఏడు మ్యాచ్‌ల్లో 213 పరుగులు చేసిన మన్విందర్ బిస్లా.. ఫైనల్లో 48 బంతుల్లో 89 పరుగులు చేసి కేకేఆర్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఐపీఎల్ ఫైనల్లో అత్యధిక పరుగులు చేసిన అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా రికార్డు సాధించాడు. ఇప్పటి ఈ రికార్డ్ చెక్కుచెదరకుండా ఉంది. కానీ ఆ తర్వాత అతను ఆ జోరు కొనసాగించలేక ఆటకు దూరమయ్యాడు. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 41 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన ప్రవీణ్ తాంబే.. అతిపెద్ద వయస్కుడైన ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. ఎలాంటి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన అనుభవం లేని అతన్ని రాహుల్ ద్రవిడ్ గుర్తించి అవకాశం కల్పించాడు. డీవై పాటిల్ మైదానంలో సంధాన అధికారిగా పనిచేసిన తాంబే.. అక్కడి మ్యాచ్‌ల్లో బ్యాటర్లను ఇబ్బంది పెట్టి రాజస్థాన్ స్కౌట్స్‌ను ఆకట్టుకున్నాడు.

# చరిత్ర సృష్టించిన జనిక్ సినర్

## ఇటాలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవ

ఇటలీ టెన్నిస్ స్టార్ జనిక్ సినర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక ఇటాలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీలో తాజాగా జరిగిన ఫైనల్‌లో ప్రపంచ నంబర్ వన్ సినర్, నార్వేకు చెందిన కాస్పర్ రూడ్‌ను 6-4, 6-4 తేడాతో వరుస సెట్లలో ఓడించాడు. దీంతో గత 50 ఏళ్లలో ఇటాలియన్ ఓపెన్ గెలిచిన తొలి ఇటలీ పురుష ఆటగాడిగా సినర్ రికార్డు కొట్టాడు. చివరిసారిగా 1976లో ఇటలీ ఆటగాడు అడ్రియానో పనట్టా ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక టైటిల్ గెలిచిన అనంతరం సిన్నర్ మాట్లాడుతూ "ఈ ట్రోఫీ 50 ఏళ్ల తర్వాత ఇటలీకి తిరిగి వచ్చింది. ఇది నాకు, యావత్ దేశానికి ఎంతో ప్రత్యేకమైన క్షణం" అని వ్యాఖ్యానించాడు.రెండుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్‌గా నిలిచిన కాస్పర్ ఈ ఫైనల్‌లో సినర్‌కు గట్టి సవాల్ విసిరాడు. మ్యాచ్‌లో అద్భుతమైన ఆరంభం చేసి, తొలుత ఆధిక్యం సాధించాడు. అయితే కరెక్ట్ టైమ్‌లో సినర్ కమ్‌బ్యాక్ ఇచ్చాడు. మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధిస్తూ, లీడ్‌లోకి దూసుకెళ్లాడు. అదే ఆధిక్యం కొనసాగిస్తూ మ్యాచ్‌లో విజేతగా నిలిచాడు. అయితే మ్యాచ్ అనంతరం రూడ్ మాట్లాడుతూ "ఈ ఏడాది నువ్వు సాధిస్తున్న విజయాలను వర్ణించడం కష్టం. చరిత్ర సృష్టించినందుకు అభినందనలు" అని సినర్‌కు శుభాకాంక్షలు తెలిపాడు. కాగా, కాస్పర్ రూడ్‌పై సినర్ 5-0 'హెడ్-టు-హెడ్' రికార్డుతో లీడ్‌లో ఉన్నాడు.



సినర్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా తన 29వ మ్యాచ్ గెలిచాడు. దీంతో ఈ ఏడాది క్లే కోర్టులలో తన రికార్డును 17-0 మెరుగుపర్చుకున్నాడు. ఇక ఇప్పుడు అందరి దృష్టి వచ్చే వారం ప్రారంభం కానున్న ఫ్రెంచ్ ఓపెన్‌పైనే ఉంది. ఆ టోర్నీలో సినర్ టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగనున్నాడు. కెరీర్‌లో అనేక రికార్డులు సాధిస్తున్న సినర్‌కు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ మాత్రం ఇప్పటిదాకా అందలేదు. గతేడాది ఫైనల్ దాకా వెళ్లినా, కర్లోస్ అల్కరాస్ చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు. దీంతో ఈసారి ఎలాగైనా ఈ గ్రాండ్ స్లామ్ నెగ్గాలని భావిస్తున్నాడు. పురుషుల డబుల్స్ టైటిల్ కూడా ఇటలీనేక కైవసం చేసుకుంది. ఈ విభాగంలో సిమోనే బెలోలి - ఆంద్రియా వావసొరి జోడీ పురుషుల డబుల్స్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచింది. ఈ జోడీ మార్సెల్ గ్రానోలర్స్-హెూరాసియో జిబాల్లోస్‌పై 7-6 (8), 6-7 (3), 10-3 స్కోరుతో నెగ్గింది. ఒకే రోజు ఇలా రెండు విభాగాల్లో టైటిళ్లు దక్కించుకోవడంతో ఇటలీకి ఇది చిరస్మరణీయ సందర్భంగా మారింది. కాగా, 1960 తర్వాత రోమ్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌ను ఒక ఇటాలియన్ జోడీ గెలుచుకోవడం ఇదే మొదటిసారి.



# డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

## రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత

నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.

# మాటలతో కాదు ఆటతోనే..

## 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది..




గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు ముంబయి వేదికగా గ్రాండ్‌గా విడుదలైంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ట్రైలర్ చూస్తుంటే థియేటర్లలో మెగా జాతర ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రామ్‌చరణ్ మేకోవర్, ఆయన నటన, డైలాగ్స్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేలా ఉన్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ నేపథ్యం ఉన్న స్పోర్ట్స్ డ్రామాను దర్శకుడు బుచ్చిబాబు ఎంత ఎమోషనల్‌గా తెరకెక్కించారో ట్రైలర్ స్పష్టం చేస్తోంది. చరణ్ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఆటగాడిగా ఎదగడం గమనించొచ్చు. ఏఆర్ రెహ్మాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రత్నవేలు విజువల్స్ ట్రైలర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.

రామ్‌చరణ్ చెప్పిన కొన్ని డైలాగ్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు. నేను పోరాడాను సారు..." ఈ డైలాగ్ సినిమాలోని చరణ్ క్యారెక్టర్ తీవ్రతను, పోరాటాన్ని తెలియజేస్తోంది. "మాటలతో కాదు.. ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికి ఉందో రమ్మను" అనే డైలాగ్ మాస్ ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది.

మొత్తంగా 'పెద్ది' ట్రైలర్ సినిమాపై అంచనాలను ఓ రేంజ్‌కు తీసుకెళ్లింది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మనసుకు హత్తుకునే ఎమోషన్స్ ఉన్న పక్కా పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ మెటీరియల్‌లా ఇది కనిపిస్తోంది. జూన్ 4న థియేటర్లలో చరణ్ బాక్సాఫీస్ వేట ఎలా ఉండబోతుందో చూడాలి!

వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ రాజ్ కుమార్, జగపతి బాబు, ఉపేంద్ర లిమయే, కృతిశెట్టి, దివ్యేందు శర్మ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు

# టాక్సిక్ విడుదలలో మరింత జాప్యం

## కారణాలను వెల్లడించిన హీరో యశ్



యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ ని వ వా న ం ప్రకటించినప్పటినుంచే ప్రమోషన్స్, మార్కెటింగ్ మొదలుపెడతారు. కానీ, 'టాక్సిక్' విషయంలో మేము హాలీవుడ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. మొదట సినిమాను మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాతే డిస్ట్రిబ్యూషన్ గురించి మాట్లాడుకుంటాం. ప్రస్తుతం నేను సినిమా విడుదల ప్రణాళికల పనుల్లోనే ఉన్నాను. ఈ పద్ధతి కచ్చితంగా అభిమానులకు నచ్చకపోవచ్చని అన్నారు. మొదట ఈ సినిమాను మార్చి 19న విడుదల చేయాలని భావించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా జూన్ 4కు వాయిదా వేశారు. తర్వాత ఈ తేదీకి కూడా రావడం లేదంటూ యశ్ పోస్ట్ పెట్టారు. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయిందని ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి రిలీజ్ చేయాలనే ఇప్పుడు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.



# ఒంటరిగా ఉండేందుకు కూడా సిద్ధమే

## : సారా అలీ ఖాన్

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'పతి పత్నీ ఔర్ వో దో' ఇటీవల మే 15న విడుదలై, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. నేటితరం ప్రేమకథలు, ఆధునిక వైవాహిక బంధాల్లో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలను ఈ సినిమాలో ఎంతో ఆసక్తికరంగా చూపించడంతో ప్రేక్షకులకు ఇది బాగా కనెక్ట్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సారా అలీ ఖాన్ పెళ్లి బంధంపై తనకున్న ప్రాక్టికల్ ఆలోచనలను, తన వ్యక్తిగత అభిప్రాయాలను ఎంతో ఓపెన్‌గా పంచుకున్నారు.తన వ్యక్తిగత జీవితంలో, చుట్టుపక్కల కొన్ని పెళ్లి బంధాలు విఫలమై విడిపోవడాన్ని కళ్లారా చూసిన సారా, వివాహం అనే వ్యవస్థను కేవలం ఊహల్లో చూసి తేలిపోనని స్పష్టం చేశారు. మనం పెరిగిన వాతావరణం, మన చుట్టూ చూసే సంఘటనల నుంచే మన ఆలోచనలు పుడతాయని పేర్కొంటూ, హడావుడిగా పెళ్లి చేసుకుని బాధపడే కంటే కాస్త సమయం తీసుకుని సరైన వ్యక్తి దొరికే వరకు వేచి చూడటం ఎంతో ఉత్తమమని ఆమె అభిప్రాయపడ్డారు. ఒకవేళ తన జీవితంలోకి సరైన భాగస్వామి దొరకకపోతే, ఎవరికోసం తనను తాను మార్చుకోకుండా జీవితాంతం ఒంటరిగా ఉండటానికైనా సిద్ధమేనని సారా తెగేసి చెప్పారు.నన్ను ఎవరో వచ్చి సంపూర్ణురాలిగా చేయాల్సిన అవసరం లేదని, ఒక సంపూర్ణమైన మనిషిగా సొంతంగా ఎదగడానికే తాను ప్రాధాన్యత ఇస్తానని సారా ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తనకంటూ ఉన్న ప్రత్యేక గుర్తింపును గౌరవిస్తూ, తన సంతోషాన్ని పంచుకునే వ్యక్తి దొరికినప్పుడే పెళ్లి గురించి ఆలోచిస్తానని చెబుతూ, ప్రస్తుతానికి మాత్రం తన పూర్తి దృష్టి కేవలం కెరీర్, సొంత ఎదుగుదల, సినిమాలపైనే ఉందని ఆమె క్లారిటీ ఇచ్చారు.

# కొరటాల, బాలయ్య కాంబో

## ఆసక్తికర అప్‌డేట్లతో చిత్రసీమలో హాట్ టాపిక్



టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ఈ సినిమాలో సమాన ప్రాధాన్యం ఉండబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయని, కొరటాల శివ తన స్టైల్‌కు తగ్గట్టుగానే బలమైన సందేశంతో కూడిన కథను సిద్ధం చేశారని టాక్ వినిపిస్తోంది.

# తమిళనాడు సినిమాటోగ్రఫీ మంత్రిగా రాజ్ మోహన్...

## విజయ్ నిర్ణయాన్ని తప్పుబట్టిన విశాల్!



తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తీసుకున్న ఓ నిర్ణయంపై ప్రముఖ నటుడు విశాల్ బహిరంగంగా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన కేబినెట్‌లో సినిమాటోగ్రఫీ, ఫిల్మ్ టెక్నాలజీ శాఖను ఎగ్మోర్ ఎమ్మెల్యే రాజ్‌మోహన్‌కు కేటాయించడాన్ని విశాల్ తప్పుబట్టారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ చేశారు.

"సీఎం జోసెఫ్ విజయ్ మంత్రులకు శాఖలు కేటాయించడం సంతోషంగా ఉంది. కానీ, ఫిల్మ్ టెక్నాలజీ మంత్రిగా రాజ్‌మోహన్‌ను నియమించడం నిరాశపరిచింది," అని విశాల్ పేర్కొన్నారు. తమిళ చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల గురించి రాజ్‌మోహన్‌కు పెద్దగా అనుభవం లేదని, దశాబ్దాలుగా పరిశ్రమలో ఉన్న సీఎం విజయ్ ఈ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. తాను రాజ్‌మోహన్‌ను కించపరచడం లేదని, ఇది కేవలం తన అభిప్రాయం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విశాల్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ తీసుకురావాలని, "ఒకే దేశం-ఒకే పన్ను" విధానం ప్రకారం సినిమాలపై స్థానిక సంస్థల పన్నును రద్దు చేయాలని, చిన్న సినిమాలకు ఇచ్చే సబ్సిడీని పెంచాలని కోరారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com